ప్రజా తపన
prajathapana.com
News that matters



సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద

సంపుటి :01 సంచిక: 189 మంగళవారం 05 సెప్టెంబర్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-

## కరోనా టీకాకు.. గుండెపోటు ముప్పుకు సంబంధం లేదు!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:**



కరోనా వైరస్ విజృంభణ తర్వాత దేశంలో గుండెపోటు ముప్పు పెరిగిందనే ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా వ్యాక్సిన్ ప్రభావం గుండెపోటు కేసులు పెరగడానికి ఏమైనా కారణమా అనే అనుమానాలు వచ్చాయి. ఈ కోణంలో కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో పరిశోధనలు చేస్తోంది. ఇదే సమయంలో భారత్‌లో వినియోగించిన కరోనా వ్యాక్సిన్లకు, గుండెపోటు ముప్పు పెరుగుదలకు ఎటువంటి సంబంధం లేదని తాజా అధ్యయనం వెల్లడించింది. మన దేశంలో కరోనా వ్యాక్సిన్‌లు సురక్షితమైనవేనని పరిశీలన అధ్యయనం తెలిపింది. ఇందుకు సంబంధించిన నివేదిక.. పీఎల్ఓఎస్ వన్ జర్నల్‌లో ప్రచురితమైంది.

'భారత్‌లో వ్యాక్సిన్‌లు సురక్షితమని మా అధ్యయనంలో వెల్లడైంది. భారత్‌లో గుండెపోటుకు వ్యాక్సిక్‌లతో సంబంధం లేదు. వ్యాక్సిన్ తీసుకున్న వారిలో

02

# జీ 20కు హస్తిన ముస్తాబు

### ఢిల్లీకి రానున్న దేశాధినేతలు...

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:**




జీ-20 సదస్సును భారత ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకుంది. సమావేశాలకు వచ్చే ప్రముఖులకు అతిథి మర్యాదలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచ దేశాధినేతలకు చక్కటి ఆతిథ్యం ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేపడుతున్నారు. వారి కోసం దేశ రాజధాని ఢిల్లీలో ప్రముఖ హోటళ్లను ఇప్పటికే బుక్ చేశారు. సదస్సుకు వచ్చే ప్రతినిధులకు వారికి భారత వంటలను రుచి చూపించేందుకు, భారత ఆతిథ్యాన్ని పరిచయం చేసేలా హోటళ్ల నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. అతిథులకు స్వాగతం పలకడం దగ్గర నుంచి వారికి బస, వంటకాల ఏర్పాట్లపై హోటల్లు ప్రత్యేక దృష్టి పెట్టాయి. అతిథులను మెప్పించేందుకు హోటళ్లను రంగుల పూలతో అందంగా అలంకరిస్తున్నాయి. వారికి ఏమాత్రం లోటు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. అతిథులకు విదేశీ వంటకాలతో పాటు భారత రుచులను పరిచయం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తాజ్ హోటల్ నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ దేశాధినేతలు బస చేసే గదులను పోలీసులు, భద్రతా సిబ్బంది ఇప్పటికే తనిఖీ చేశారని చెప్పారు. జీ-20 అతిథులకు అంతర్జాతీయ వంటకాలతో సహా 250కి పైగా రుచికరమైన వంటకాలను అందించాలని లలిత్ హోటల్ ప్రణాళిక చేస్తోంది. తృణధాన్యాల ఆధారిత వంటకాలను కూడా తయారు చేస్తోంది. అమెరికా అధ్యక్షుడు జో బై డెన్ , బ్రిటిష్ ప్రధాని

02

# కొలిక్కిరాని ధాన్యం ఎగుమతుల వివాదం!



**మాస్కో:**

నల్ల సముద్రం మీదుగా ఆహార ధాన్యాల ఎగుమతులకు ఉక్రెయిన్, రష్యాల మధ్య కుదిరిన 'ధాన్యం ఎగుమతుల ఒప్పందం జులైలో నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఎగుమతుల విషయంలో తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఈ ఒప్పందాన్ని నిలిపేస్తున్నట్లు రష్యా పేర్కొంది. తాజాగా రష్యాలోని సోచి వేదికగా.. దేశాధినేత పుతిన్ (, తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌ల మధ్య జరిగిన భేటీ సందర్భంగా ఈ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. అయితే, ఈ వివాదం కొలిక్కి రాలేదు.

త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందని సమావేశం అనంతరం ఎర్డోగాన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం విషయంలో రష్యాపై ఉక్రెయిన్ తన కఠిన వైఖరిని కాస్త వీడాలని కోరారు. అంతకుముందు 'ధాన్యం ఒప్పందం'పై రష్యా వైఖరిని పునరుద్ఘాటించిన పుతిన్.. ఈ అంశంపై చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తమ డిమాండ్లు నెరవేరిన తర్వాత ఒప్పందంలో తిరిగి వచ్చేందుకు అభ్యంతరం లేదన్నారు. నల్ల సముద్రం కారిడార్లను సైనిక ప్రయోజనాలకు ఉపయోగించరాదని పేర్కొన్నారు.

గతేడాది ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్య మొదలు.. ఈ రెండు దేశాల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. సమస్యకు పరిష్కారంగా

02

## చంద్రుడి ఉపరితలంపై మరో చోట ల్యాండైన విక్రమ్ ల్యాండర్

**న్యూఢిల్లీ సెప్టెంబర్ 4**



చంద్రయాన్-3 మిషన్ సూపర్ సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోంది. తాజాగా విక్రమ్ ల్యాండర్‌ను మళ్లీ సాఫ్ట్ ల్యాండింగ్ చేశారు. చంద్రుడి ఉపరితలంపై మరో చోట విక్రమ్ ల్యాండైంది. దీనికి సంబంధించిన విషయాన్ని ఇస్రో ఇవాళ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో వెల్లడించింది. తాము ఇచ్చిన కమాండ్‌కు విక్రమ్ సక్రమంగా స్పందించినట్లు ఇస్రో చెప్పింది. ఆగస్టు 23వ తేదీన తొలిసారి చంద్రుడి దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండైన విషయం తెలిసిందే. అయితే తాజాగా మిషన్ లక్ష్యంలో భాగంగా ఆ ల్యాండర్‌ను మరో చోట దించారు. దీని

02



# ఇక రెండు పెళ్లిళ్లు కదురవు

**గౌహతి, సెప్టెంబర్ 4:**

అస్సాంలోని డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో ఓ కీలకమైన బిల్లును ప్రవేశపెట్టనుంది రాష్ట్ర ప్రభుత్వం. అస్సాంలో బహుభార్యత్వాన్ని నిషేధిస్తూ బిల్లును ప్రవేశపెట్టనున్నామని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. టిన్‌సుకియాలో తాజాగా అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 45 రోజుల్లో ఈ బిల్లును సిద్ధం చేస్తామని చెప్పారు. అలాగే డిసెంబర్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ బిల్లును ప్రవేశపెడతామని పేర్కొన్నారు. మరో విషయం ఏంటంటే శనివారం జరిగిన ఈ సమావేశంలో అస్సాం ప్రభుత్వం బహుభార్యత్వం అనే బిల్లును చాలా సీరియస్‌గా తీసుకుందని అన్నారు. ఇప్పటికే దీనిపై ఒక లీగల్ కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే బహుభార్యత్వాన్ని నిషేధించడంలో

02

## అల్పపీడన ప్రభావంతో మూడు రోజులూ భారీ వర్షాలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 4**



అల్పపీడన ప్రభావంతో వచ్చే మూడు రోజులపాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు వర్షాలు కురిసే సూచనలున్నాయని హైదాబాద్ వాతావరణశాఖ తెలిపింది. నేడు, రేపు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురుస్తా యని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల,

02

# ప్రభుత్వ వైద్య సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లండి..

**సీఎం జగన్ నాయకత్వంలో వైద్యరంగానికి పెద్దపీట**

**ముఖ్యమంత్రి చొరవతో ఇప్పటికే సర్వజనాస్పత్రి విస్తరణ పనులు**

**మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే మా లక్ష్యం**

**అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ**

**సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద క్రిటికల్ కేర్ సెంటర్‌కు శంకుస్థాపన**

**8 నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

**సేవలను ప్రజలు వినియోగించుకోవాలి : ఎంపీ రంగయ్య..**





**అనంతపురం (ప్రజా తపన )సెప్టెంబర్ 4 :**

ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. సోమవారం నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద 50 పడకల సామర్థ్యంతో రూ.23.75 కోట్ల నిధులతో క్రిటికల్ కేర్ సెంటర్‌కు ఎంపీ రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీంతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ పేదవాడికి జబ్బు చేస్తే ముందుగా చూసేది ప్రభుత్వ ఆస్పత్రుల వైపేనని.. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ వల్ల ఇప్పటికే నాడు%--%నేడు కార్యక్రమం కింద రూ.300 కోట్లతో సర్వజనాస్పత్రి విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇందుకోసం ఆర్అండ్‌బి, ఇరిగేషన్‌కు సంబంధించి స్థలాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఇక్కడ ఏడు రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, 500కు పైగా మేజర్, మైనర్ ఆపరేషన్లు నిర్వహించినట్లు చెప్పారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు సర్వజనాస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. గతంలో వైద్య చికిత్సల కోసం కర్నూలు, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లే పరిస్థితి ఉండేదని, కానీ ఇక్కడ కూడా క్రిటికల్ కేసులకు చికిత్స అందుతోందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తాజాగా శంకుస్థాపన చేసిన క్రిటికల్ కేర్ సెంటర్‌ను ఎనిమిది నెలల్లో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతపురం ఎంపీ రంగయ్య మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందుకోవాలంటే లక్షలు ఖర్చు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. కానీ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో నేడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ వైద్యం అందుతోందని చెప్పారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఇతర వైద్యులతో సమావేశమయ్యారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం వద్దని ఎమ్మెల్యే అనంత సూచించారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, అందరూ సమిష్టిగా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రమణ్యం, అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ మహబూబ్, డీఈ శ్రీనివాసులు నాయుడు, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజని, కార్పొరేటర్ సంపంగి రామాంజినేయులు, వైసీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# అల్పపీడన ప్రభావంతో మూడు రోజులూ భారీ వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)



నిర్మల్, భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వానలు పడే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం నుంచి బుధవారం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు అతిభారీ వర్ష సూచన ఉన్నదని వాతావరణ శాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది.కాగా, సోమవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా జోరుగా వర్షం కురుస్తున్నది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీటికితోడు ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండటంతో ప్రాజెక్టుల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, హైదర్‌నగర్, నిజాంపేట, ప్రగతినగర్, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి, సూరారం, సుచిత్ర, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, బాలానగర్ ప్రాంతాల్లో ఉదయం నుంచి వర్షం కురుస్తున్నది.నిజామాబాద్ జిల్లాలో ఎడతెరిపిలేకుండా వాన పడుతున్నది. మోపాల్ మండలంలో 15.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఇందల్వాయిలో 14.8, డిచ్‌పల్లిలో 14.2, జక్రాన్‌పల్లి 13.8, సిరికొండలో 13.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలోని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. జుక్కల్-బస్వపూర్ మధ్యలో వంతెన పనులు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయ రోడ్డు కోతకు గురవడంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. ఇక సిరికొండ మండలంలో కప్పల వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నది. గడ్కోల్ వద్ద లోలెవల్ బ్రిడ్జ్‌పై వాహనాలను అధికారులు నిలిపివేశారు.కామారెడ్డి జిల్లా రాజాంపేట, బీబీపేట, మండలాల్లో భారీ వర్షం కురుస్తున్నది. మాచారెడ్డి, బిక్కనూర్, దోమకొండ మండలాల్లో కుండపోతగా వానపడింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. గాంధారి మండలంలో 14.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. సదాశివనగర్‌లో 12, జుక్కల్‌లో 11.7 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

## కరోనా టీకాకు.. గుండెపోటు ముప్పుకు సంబంధం లేదు!

(మొదటిపేజీ తరువాయి)

గుండెపోటు మరణాలు తక్కువగా ఉన్నాయని ఈ అధ్యయనంలో గుర్తించాం' అని అధ్యయనానికి నేతృత్వం వహించిన జీబీ పంత్ ఆస్పత్రికి చెందిన మోహిత్ గుప్తా వెల్లడించారు. వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత అక్యూట్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్ ఎప్పుడూ కనిపించలేదని తమ విశ్లేషణలో తేలినట్లు చెప్పారు. ఆస్పత్రిలో చేరిన ఏఎంఐ బాధితుల్లో.. వయసు, మధుమేహం, ధూమపానం కారణాల వల్లే మరణం ముప్పు ఎక్కువగా కనిపించిందన్నారు. అయితే, ఇది ఒకే కేంద్రంలో జరిపిన అధ్యయనమని.. ఇందుకు కొన్ని పరిమితులు ఉన్నాయని పరిశోధకులు పేర్కొన్నారు.

గుండెపోటు తర్వాత బాధితుల మరణానికి సంబంధించి వ్యాక్సిన్ ప్రభావం ఏమైనా ఉందా..? అన్న విషయాన్ని తెలుసుకునేందుకు గతేడాది మన దేశంలోనే ఓ అధ్యయనం జరిగింది. ఇందుకోసం దిల్లీలోని జీబీ పంత్ ఆస్పత్రిలో ఆగస్టు 2021-ఆగస్టు 22 మధ్య కాలంలో చేరిన 1578 మంది రోగుల సమాచారాన్ని విశ్లేషించారు. వీరిలో 1086 మంది వ్యాక్సిన్ తీసుకున్నవారు కాగా.. 492 మంది టీకా తీసుకోనివారే. వ్యాక్సిన్ తీసుకున్న వారిలో 1047 (96 శాతం) మంది రెండు డోసులు తీసుకోగా.. మరో 4శాతం మాత్రం కేవలం ఒక డోసు తీసుకున్నారు.

# జీ 20కు హస్తిన ముస్తాబు

(మొదటిపేజీ తరువాయి)

రిషి సునాక్ సహా 24 దేశాధినేతలు సమావేశాలకు హాజరుకానున్న నేపథ్యంలో ఆతిథ్యానికి ఎటువంటి వంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే అతిథులు బస చేస్తున్న హోటళ్ల వద్ద కఠిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌కు ఐటీసీ మౌర్యలో బస ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా దేశాల ఇంటలిజెన్స్ సంస్థల అధికారులు ఢిల్లీకి చేరుకొని తమ అధినేతల రాకపోకల ఏర్పాటు చేసుకుంటున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ జి 20 శిఖరాగ్ర సదస్సుకు హాజరు కావడం లేదు. ఈ రెండు దేశాల అధ్యక్షులు హాజరు కాకపోవడం వెనుక కారణాలపై రకరకాల చర్చలు జరుగుతున్నాయి. జీ-20 సదస్సుకు సంబంధించిన ఢిల్లీలోని కీలకమైన వేదికలు, ఇతర ప్రాంతాల వద్ద సన్నద్ధతను ఆదివారం కొందరు ప్రభుత్వ ప్రతినిధులు పరిశీలించారు. ఆ బృందంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాతో పాటు ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి పీకే మిశ్ర ఉన్నారు. జీ 20 సదస్సుకు ఢిల్లీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రోడ్లకు ఇరువైపులా ల్యాండ్ స్కేపింగ్ చేసి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జి20 సదస్సు జరిగే భారత మండపం వరకు పరిసరాలన్నిటిని అలంకరించారు. రోడ్లకు ఇరువైపులా జీ 20 దేశాల జెండాలు నిలబెట్టారు. భారతదేశ కళావైభవ చిహ్నాలు అన్నిటిని రోడ్ల ముఖ్య కూడలిలో అందంగా అమర్చారు. వివిధ రాష్ట్రాలకు సంబంధించిన కళారూపాల ఫ్లెక్సీలను విమానాశ్రయం వద్ద ప్రదర్శనగా పెట్టారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఈ డెకరేషన్స్ చేశారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో ఢిల్లీ అనధికారిక లాక్ డౌన్ లోకి వెళ్లబోతోంది. ఢిల్లీకి వచ్చే దాదాపు 100కు పైగా రైళ్లను ఈ మూడు రోజుల్లో రద్దు చేశారు. అలాగే విమాన రాకపోకలు సైతం రద్దు చేశారు. సెంట్రల్ ఢిల్లీని పూర్తిగా శత్రు దుర్భేద్యంగా మార్చేశారు. కేవలం సెంట్రల్ ఢిల్లీలో నివసించేవారు మినహా మిగిలిన వారెవరిని సెంట్రల్ ఢిల్లీలోకి అనుమతించడం లేదు. దేశాధినేతల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకే ఈ మూడు రోజులపాటు ఆంక్షలు విధించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి

## కొలిక్కిరాని ధాన్యం ఎగుమతుల వివాదం!

(మొదటిపేజీ తరువాయి)

గతేడాది జులైలో.. తుర్కియే, ఐరాస సమక్షంలో ఈ రెండు దేశాల మధ్య 'ధాన్యం ఎగుమతుల ఒప్పందం' కుదిరింది. అయితే.. గతేడాది నవంబరులో ఒకసారి, ఈ ఏడాది జులైలో మరోసారి రష్యా ఈ ఒప్పందం నుంచి బయటకు వచ్చింది. ఉక్రెయిన్‌లో ధాన్యం రవాణాకు కీలకమైన ఒడెస్సా పోర్టులోని కీలక సదుపా యాలను ఇటీవల ధ్వంసం చేసింది. ఈ పరిణామాల నడుమ పుతిన్- ఎర్డోగాన్‌ల భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

## చంద్రుడి ఉపరితలంపై మరో చోట ల్యాండైన విక్రమ్ ల్యాండర్



(మొదటిపేజీ తరువాయి)

కోసం నిర్వహించిన హాప్ ఎక్స్‌పరిమెంట్ విజయవంతం అయినట్లు ఇస్రో తెలిపింది.కమాండ్ ఇచ్చిన తర్వాత విక్రమ్ ల్యాండర్ ఇంజిన్లు ఫైర్ అయ్యాయని, ఆ తర్వాత ఆ ల్యాండర్ దాదాపు 40 సెంటీమీటర్ల మేరకు పైకి లేచి.. సుమారు 30 నుంచి 40 సెంటీమీటర్ల దూరంలో సురక్షితంగా ల్యాండ్ అయినట్లు ఇస్రో వెల్లడించింది. ఈ మిషన్‌కు చెందిన వీడియోను కూడా ఇస్రో తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసింది. విక్రమ్ ల్యాండర్ చేపట్టిన ప్రయోగం చాలా కీలకమైందని ఇస్రో తెలిపింది. భవిష్యత్తులో చేపట్టబోయే ప్రయోగాలకు ఇది నాందిగా నిలుస్తుందని వెల్లడించింది. ఒకవేళ చంద్రుడి నుంచి మళ్లీ భూమ్మీదకు శ్యాంపిల్స్ తీసుకురావాలన్నా, లేక మానవుల తరలింపు ప్రక్రియ చేపట్టాలన్నా, ఇవాళ నిర్వహించిన ప్రయోగం కీలకమైందని ఇస్రో తెలిపింది.విక్రమ్ ల్యాండర్‌కు చెందిన అన్ని సిస్టమ్స్ నార్మల్‌గా పనిచేస్తున్నట్లు ఇస్రో పేర్కొన్నది. ర్యాంప్‌ను మోహరించామని, చేస్ట్, ఐఎల్ఎస్ఏ పరికరాలు ఫోల్డ్ అయ్యాయని, పరీక్ష పూర్తి అయిన తర్వాత అవి మళ్లీ యధావిధిగా తమ పని చేస్తున్నట్లు ఇస్రో చెప్పింది.

# ఇక రెండు పెళ్లిళ్లు కదురవు

(మొదటిపేజీ తరువాయి)

సాధ్యాసాధ్యాల గురించి అధ్యయనం చేయాల్సిందిగా కమిటీకి సూచించినట్లు పేర్కొన్నారు.ఇదిలా ఉండగా ఈ అంశంపై ప్రజాభిప్రాయలను కూడా సేకరించామని ముఖ్యమంత్రి తెలిపారు. మొత్తం 149 నుంచి ఈ అభిప్రాయం తీసుకోగా వారిలో 146 మంది ఈ బిల్లుకు సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. అలాగే మరో ముగ్గురు మాత్రం బహుభార్యత్వానికి మద్దతు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇక ఈ బిల్లును రూపొందించడమే తమ తర్వాతి కార్యచరణని పేర్కొన్నారు. అంతేకాదు వీలైతే రాష్ట్రంలో లవ్ జిహాద్‌ను కూడా అంతం చేసేలా ఈ బిల్లులో మరికొన్ని అంశాలను చేరుస్తున్నామని తెలిపారు. అయితే ఈ సందర్భంగా సాయుధ దళాల ప్రత్యేక అధికారులు ఉపసంహరించే చట్టం గురించి ప్రస్తావిస్తూ.. అది రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయమని ఆ విషయంలో కేంద్ర ప్రభుత్వానిదే చివరి నిర్ణయం అని చెప్పారు. ఈ నెల చివరికి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి కచ్చితమైన నిర్ణయాన్ని తీసుకుంటామని పేర్కొన్నారు.

# హ్యాట్రిక్ కోసం నాని వ్యూహాలు

**విజయవాడ, సెప్టెంబర్ 4:**

తెలుగుదేశం పార్టీలో విజయవాడ ఎంపీ కేశినేని ఏకు మేకై కాబోతున్నారా? టీడీపీ నేతలతోపాటు అధిష్టానంతో అమీతుమీ తేల్చుకునేందుకు రెడీ అయ్యారా? నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు డుమ్మా కొట్టిన కేశినేని నాని వచ్చే ఎన్నికల్లో తనదే టికెట్ అని అంత గంటా పథంగా ఎలా చెప్తున్నారు? విజయవాడలో తీవ్ర అసమ్మతి ఎదుర్కొంటున్న కేశినేని నాని ముచ్చటగా మూడోసారి ఎంపీగా గెలుపొందుతానంటూ చెప్పడంలో వ్యూహం ఏమిటి? లోకేశ్ ఆశీస్సులు లేకుండానే ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. విజయవాడ ఎంపీ కేశినేని నాని ఇప్పుడు టీడీపీలో సంచలనంగా మారారు. విజయవాడ మేయర్ ఎన్నికల్లో తన కుమార్తె మేయర్ కాకుండా అడ్డుకుంది తన సొంత పార్టీ నేతలేనని ఎంపీ కేశినేని ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి కేశినేని నాని వారికి దూరంగా ఉంటున్నారు. తాజాగా కేశినేని నాని విజయవాడ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థిని ప్రకటించేశారు. విజయవాడ పశ్చిమ నుంచి బేగ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించుకుంటానని ధీమా వ్యక్తం చేయడం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తుంది.తెలుగుదేశం పార్టీలో ఓ వెలుగు వెలుగొందుతున్న విజయవాడ ఎంపీ కేశినేని నానికి అసమ్మతి వర్గం చెక్ పెట్టింది. ఎంపీ కేశినేని నాని తనకుమార్తె కేశినేని శ్వేతను మేయర్‌గా చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకు బెజవాడ



కేంద్రంగా టీడీపీలో రాజకీయం చేస్తున్న నాయకులు ఎంపీ కేశినేని నానికి ప్రత్యర్థులుగా మారారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమ మహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, నాగుల్ మీరాలు ఆ మేయర్ ఎన్నికల్లో సహాయ నిరాకరణ చేశారు. అంతేకాదు టీడీపీ అభ్యర్థుల తరఫున చంద్రబాబు నాయుడు ప్రచారం చేసే రూట్ మ్యాప్ విషయంలోనూ విభేధాలు తలెత్తాయి. దీంతో శ్వేతను మేయర్ కుర్చీలో కూర్చోబెట్టుకోలేకపోయారు కేశినేని నాని. అనంతరం విజయవాడ కేంద్రం అసమ్మతి వర్గం కేశినేని నానికి చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు మె?దలు పెట్టింది. ఇందులో భాగంగా కేశినేని నాని సోదరుడు కేశినేని చిన్నిని తెరపైకి తీసుకువచ్చింది. కేశినేని చిన్నికి అండగా నిలుస్తూ వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించాలని అసమ్మతి వర్గం ప్రయత్నాలు చేస్తోంది. అసమ్మతి వర్గం అండదండలతో కేశినేని చిన్ని దూసుకుపోతున్నారు. టీడీపీ మహానాడులో కానీ ఇటీవల లోకేశ్ యువగళం పాదయాత్రలో కానీ అన్నీ తామై వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం ఎంపీ కేశినేని నానికి నచ్చడం లేదు. అసమ్మతి వర్గానికి ఎలా చెక్ పెట్టాలనే దానిపై వ్యూహరచన చేస్తున్నారు. ఇందులో భాగంగా వైసీపీ నేతలను పొగడ్తలతో ముంచెత్తుతున్న సంగతి తెలిసిందే.ఇదిలా ఉంటే విజయవాడ ఎంపీ కేశినేని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నుంచి ఎవరు అడ్డొచ్చినా బేగ్‌ను ఎమ్మెల్యేగా చేస్తానంటూ సంచలన ప్రకటన చేశారు. బేగ్ అభ్యర్థిగా అధిష్టానం ఇంకా ప్రకటించలేదు. అయితే ఎంపీ కేశినేని నాని ఈ ప్రకటన చేయడంపై రాజకీయంగా దుమారం రేపుతోంది. ఎందుకంటే ఈ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, నాగుల్ మీరాలు టికెట్ ఆశిస్తున్నారు. ఇందుకు సంబంధించి పలు ప్రకటనలు సైతం చేశారు. మరోవైపు విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీని కాపాడేందుకు తామిద్దరం పనిచేసినట్టుగా నాగుల్ మీరా అప్పట్లోనే ప్రకటించారు. అంటే అధిష్టానం ఇద్దరిలో ఎవరో ఒకరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని పరోక్షంగా ప్రకటించారు. ఇలాంటి తరుణంలో ఎంపీ కేశినేని నాని అటు బుద్దా వెంకన్న, ఇటు నాగుల్ మీరాలకు చెక్ పెట్టేలా ఈ ప్రకటనలు చేయడం విజయవాడ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ జరుగుతుంది.

# సొంత అజెండాతో ఠాక్రే...

**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

గత కొద్దిరోజులుగా టీ కాంగ్రెస్ అనవసర విషయాలలో వేలు పెట్టి కొత్త చిక్కులు తెచ్చుకుంటున్నారనే చర్చ పార్టీలో జరుగుతుంది. ఈ మధ్య ఠాక్రే వ్యవహారం పీసీసీ, సీఏల్పీ నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల బీసీ నేత ఆర్ కృష్ణయ్య ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు ఠాక్రే. అయితే ఆ తర్వాత ఆర్ కృష్ణయ్య మోడీని కలవడం కాంగ్రెస్?కు పెద్ద మైనస్ అయిందనే చర్చ టీపీసీసీలో జరుగుతుంది. ఆర్ కృష్ణయ్యను ఠాక్రే కలిసే విషయం కూడా చివరి నిమిషంలో పీసీసీకి చెప్పారని సమాచారం. ఇక మందకృష్ణ మాదిగను గాంధీ భవన్?కు ఆహ్వానించి , ఆ తర్వాత మందకృష్ణ మాదిగ కాంగ్రెస్ ను విమర్శించడం మరో పంచాయతీ అయ్యింది. దీంతో టీ పీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డికి ,మందకృష్ణ మాదిగకు మధ్య మాటల యుద్ధం జరిగింది. దీంతో మందకృష్ణ విషయంలో ఎరక్కపోయి ఇరుక్కున్నామా అనే పరిస్థితి వచ్చింది.కాంగ్రెస్ కు.. ఇక లెఫ్ట్ పార్టీలతో చర్చలు అంటూ ఠాక్రే రంగంలోకి దిగడం కాంగ్రెస్ లో మరో రచ్చకు దారితీసింది. బీఆర్ఎస్ తో పొత్తు వికటించడంతో కాంగ్రెస్ తో పొత్తుకు లెఫ్ట్ పార్టీలు సుముఖంగా ఉన్నాయని సమాచారం. దీంతో సీపీఐ నేతలతో ఠాక్రే చర్చలు జరిపారు. అయితే ఇదంతా పీసీసీ, సీఏల్పీ లకు తెలియకుండా జరుగుతుంది అని పార్టీ లో టాక్. పీసీసీ, సీఏల్పీ లతో చర్చలు చేయకుండానే ఠాక్రే ఇతర పార్టీ లతో చర్చలు జరుగుతున్నారని ,పార్టీకి లాభ నష్టాలను అంచనా వేయకుండా ఠాక్రే వ్యవహారం కొత్త చిక్కులు తెచ్చిపెడుతుందని టీపీసీసీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం ,నల్లగొండ జిల్లాలలో లెఫ్ట్ పార్టీలు సీట్లు అడిగే అవకాశం ఉందని.. కానీ ఖమ్మం, నల్లగొండలో పార్టీ ఇప్పటికే బలంగా ఉన్న నేపథ్యంలో అక్కడ పార్టీని డిస్టబ్ చేయడం అవసరమా అని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.రాష్ట్ర పార్టీలో కీలకంగా ఉండే పీసీసీ ఛీఫ్, సీఏల్పీలతో చర్చించకుండా ఠాక్రే సొంత నిర్ణయాలు తీసుకోవడంతో పార్టీ నేతలను అయోమయానికి గురిచేస్తుందని కొందరు సీనియర్ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే ఆర్ కృష్ణయ్య.. మంద కృష్ణమాదిగలతో ఠాక్రే భేటీ వల్ల జరిగిన పర్యవసానాలను ఏఐసీసీకి నివేదించారట టీపీసీసీ నేతలు.. ఏఐసీసీ నుంచి ఇంఛార్జ్?కి క్లియర్ డైరెక్టర్ ఇవ్వాలని కొందరు సీనియర్ నేతలు కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఇప్పటికే ఓవైపు అసెంబ్లీ ఎన్నికలు కూడ సమీపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లో అంతర్గతంగా వివాదాలు జరిగితే పార్టీకే నష్టమని రాజకీయం విశ్లేషకులు చెబుతున్నారు.

# ఏసీబీ కేసులో అరెస్టైన 24 గంటల్లో మళ్లీ విధులు

**విజయనగరం, సెప్టెంబర్ 4:**

ఏసిబి అధికారులు అరెస్ట్ చేసిన ఎలక్ట్రికల్ ఏఈ పోలాకి శాంతారావు వ్యవహారంలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఏసిబి అధికారులకే సవాలు విసిరి అరెస్ట్ అయిన కొద్ది గంటల్లోనే విధులకు హాజరై సంచలనం సృష్టించాడు శాంతారావు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం మునక్కాయ వలస వద్ద గత నెల 27 న ఈశ్వర రావు అనే ఓ రైతు నుండి లంచం తీసుకుంటుండగా ఎలక్ట్రికల్ ఏఈ శాంతారావును ట్రాప్ చేయడానికి ప్రయత్నించారు ఏసిబి అధికారులు. అయితే ఆ సమయంలో ఏసిబి అధికారులను గమనించిన శాంతారావు కారులో డోర్స్ వేసుకొని ఎదురుగా ఉన్న పంట పొలాల్లోకి కారుతో దూసుకెళ్లి పారిపోవడానికి ప్రయత్నించాడు. దీంతో ఎలాగైనా శాంతారావును పట్టుకోవాలని ప్రయత్నించిన ఏసిబి సి ఐ శ్రీనువాసరావు వెంటనే ప్రక్కనే ఉన్న ఒక బైక్ తీసుకొని కారును వెంబడించాడు. అలా చేజ్ చేస్తున్నప్పటికీ ఏ ఈ శాంతారావు ఏ మాత్రం తగ్గకుండా సిఐ బైక్ ని తన కారుతో బలంగా ఢీకొట్టాడు. ఆ ప్రమాదంలో సిఐ శ్రీనువాసరావు ప్రాణాపాయం నుండి తృటిలో తప్పించుకున్నా గాయాల పాలయ్యాడు. దీంతో మిగిలిన సిబ్బంది శాంతారావ్ కోసం వెంబడించిన ఫలితం లేదు. రాత్రి సమయం కావడంతో ఏసిబి అధికారులకు దొరక్కుండా తప్పించుకోగలిగాడు. అయితే జరిగిన ఘటనతో ఖంగు తిన్న ఏసిబి అధికారులు ప్రత్యేక బృందాలతో గాలించిన అధికారులు ఎట్టకేలకు ఏ ఈ శాంతారావును విశాఖలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టుకు హాజరు పరిచారు. అయితే కేసును పరిశీలించిన కోర్టు శాంతారావు కు 41 ఏ నోటీసులు ఇచ్చి విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో ఏసిబి అధికారులు వెంటనే 41ఏ నోటీసులు ఇవ్వడం, శాంతారావును విడుదల చేయడం చకచకా జరిగిపోయాయి. అలా విడుదల అయిన మరుక్షణమే మక్కువ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఆఫీస్ లో విధులకు హాజరయ్యాడు. ఆఫీస్ కి వచ్చిన శాంతారావుకు ఆఫీస్ సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఇదే అంశం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారి అనేక అనుమానాలకు దారి తీస్తుంది. ఏసిబి అధికారులను ముప్పు తిప్పలు పెట్టడంతో పాటు కారుతో సి ఐ ను ఢీకొట్టి పరారైన ఎలక్ట్రికల్ ఏ ఈ శాంతారావు ఎలా అంత ఈజీగా క్షణాల్లో విధుల్లోకి జాయిన్ అవ్వగలిగాడు అన్న చర్చ జోరుగా సాగుతుంది. ఈ వ్యవహారంలో ఏఈ శాంతారావు అటు అధికారులు, పలువురు రాజకీయ నాయకులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా ఏసిబి డిఎస్పీ రామచంద్రరావు పై సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిఎస్పీ రామచంద్ర రావు, శాంతారావు ఒకే సామాజిక వర్గం వారు కావడంతో శాంతారావుకు తక్షణమే బెయిల్ వచ్చేలా డిఎస్పీ కూడా సహకరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయిఅందుకోసమే కేసు వీక్ అయ్యేలా ఫైల్స్ తయారు చేశారని చెప్పుకొస్తున్నారు. దీంతో అనుకున్నట్లే కేసు పరిశీలించిన కోర్టు శాంతారావు కు 41ఏ నోటీస్ ఇచ్చి విడుదల చేయాలని ఆదేశించిందని, అలా శాంతారావు అరెస్ట్ నుండి తప్పించుకోగలిగాడని అంటున్నారు. ఏసిబి అధికారుల నుండి తప్పించుకునే ప్రయత్నంలో అడ్డుకున్న ఏసిబి, సి ఐ శ్రీనివాసరావుని శాంతారావు కారుతో ఢీకొట్టాడు. ఆ ప్రమాదంలో సి ఐ శ్రీనువాసరావు తీవ్ర గాయాల పాలయ్యాడు. విధి నిర్వహణలో ఉన్న సి ఐ పై దాడితో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాల్సి ఉండగా ఆ సంబంధిత సెక్షన్ల క్రింద కూడా కేసు నమోదు చేయకుండా శాంతా రావుకు సహకరించారని పలువురు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా సుమారు ఐదు రోజుల పాటు పరారీ కారణంగా మండల విద్యుత్ ఆఫీస్ కి హాజరుకాకుండా, సెలవు కూడా పెట్టని శాంతారావు పై అటు విద్యుత్ శాఖ అధికారులు కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కూడా మరింత అనుమానాలకు దారి తీస్తుంది. ప్రస్తుతం ఏసిబి అధికారుల పై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నా, వారు కనీసం పెదవి విప్పకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. తమ పై వస్తున్న విమర్శలు, ఆరోపణల పై ఏసిబి అధికారులు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

# ఈటెల రాజేందర్ కు తప్పిన ప్రమాదం

**కరీంనగర్, సెప్టెంబర్ 4:**

బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కాన్వాయ్ రోడ్డు ప్రమాదానికి గురైంది. అయితే బీజేపీ ప్రచార కమిటీ ఛైర్మెన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ కు తృటిలో ప్రమాదం తప్పిపోయింది. వీణవంక పర్యటనకు వెళ్ళి వస్తుండగా మానకొండుర్ మండలం లలితపూర్ లో ఈటెల కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. గొర్రెలు అడ్డురావడంతో ముందు వెళ్తున్న కాన్వాయ్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న వాహనాన్ని ఈటెల ప్రయాణిస్తున్న వాహనం ఢీకొట్టింది. ఈటల క్షేమంగా ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలుస్తోంది. ఎమ్మెల్యేకు ఎలాంటి గాయాలు కాలేదని తెలియగానే ఆయన అభిమానులు, బీజేపీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి.కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం, లలితాపూర్ గ్రామం వద్ద తాను ప్రయాణిస్తున్న వాహనానికి, తన సిబ్బంది ఉన్న వాహనానికి ప్రమాదం జరిగిందని ఎమ్మెల్యే ఈటల తెలిపారు. చీకటి పడడంతో ఎదురుగా వస్తున్న గొర్రెల మందను చివరి నిమిషంలో చూసి డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దాంతో వెనక వస్తున్న ఎస్కార్ట్ వాహనం తాను ఉన్న వాహనానికి ఢీ కొట్టడంతో వాహనం స్వల్పంగా దెబ్బతిందని చెప్పారు. భగవంతుని దయవల్ల, ప్రజల ఆశీస్సులతో తనతో పాటు అందరూ క్షేమంగా ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ట్విట్టర్ లో వెల్లడించారు.

# అధికార పార్టీకి షాకిస్తున్న సర్వేలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

ప్రతీ వారం ప్రజల నాడిని స్టడీ చేస్తున్న తెలంగాణ ఇంటెన్షన్స్ సర్వే తాజా (సెప్టెంబరు 3) నివేదికలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అనుమానమే అనే అభిప్రాయం మరింత బలపడుతున్నది. ఒక పార్టీగా కాంగ్రెస్‌కు గత వారం ప్రజల్లో ఉన్న ఆదరణే ఇప్పటికీ కొనసాగుతున్నది. బీఆర్ఎస్ 1% ఓటింగ్ పుంజుకుంటున్నా అది బీజేపీ మరింత పడిపోతున్న ఎఫెక్టేనని సర్వే అభిప్రాయపడింది.వామపక్షాలు, బీఎస్పీ, వైఎస్సార్టీపీ (షర్మిల) పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటే సీట్ల సంఖ్య ఏ మేరకు పెరుగుతుందో స్పష్టత లేకపోయినా ఓటింగ్ వాటా మాత్రం దాదాపు 5% మేర అదనంగా పొందే అవకాశమున్నట్లు ఆ సర్వే రిపోర్టు పేర్కొన్నది. ఖమ్మం టౌన్‌లో బీజేపీ నేత అమిత్ షా సభ పెట్టినా ఆ పార్టీకి బలం పెరగకపోగా ఒక శాతం మేర తగ్గిందని వివరించింది.కాంగ్రెస్ పార్టీ పొత్తు పెట్టుకోవడం ద్వారా నిర్దిష్టంగా ఎక్కడ ఎంత అనుకూలం అవుతుందనే క్లారిటీ లేకపోయినా ప్రజల్లో మాత్రం ఈ పార్టీలన్నీ ఒక జట్టుగా ఉంటే మంచిదనే అభిప్రాయం వచ్చినట్లు సర్వే వివరించింది. పొత్తు తర్వాత కాంగ్రెస్ కూటమికి సుమారు 34% మేర పోలింగ్ శాతం వచ్చే అవకాశముందని, ఒంటరిగా బీఆర్ఎస్‌కు 38% ఓట్ల షేరింగ్ వస్తుందని పేర్కొన్నది.ఒకవేళ మజ్లిస్ పార్టీతో బీఆర్ఎస్ ఓపెన్‌గా పొత్తు పెట్టుకుంటే ఖమ్మం జిల్లా మినహా రాష్ట్రంలోని రూరల్ ప్రాంతాల్లో మేలు జరుగుతుందని, ఓటింగ్ షేర్ సుమారు 43% వరకు చేరుకుంటుందని పేర్కొన్నది. ఈ రెండు పార్టీల పొత్తు జీహెచ్ఎంసీ పరిధిలో ఓట్ల పోలరైజేషన్‌కు దారితీసి రెండు పార్టీలకూ నష్టం చేస్తుందని వివరించింది.తెలుగుదేశం, బీజేపీల మధ్య పొత్తుపై వస్తున్న ఊహాగానాలతో సుమారు 14% మేర ఓటింగ్ షేర్ లభిస్తుందని, జీహెచ్ఎంసీతో పాటు నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో యాంటీ-మజ్లిస్ కారణంగా కూటమికి లాభం జరగవచ్చని అభిప్రాయపడింది. ప్రస్తుతం బీజేపీకి గత వారంతో పోలిస్తే ఒక శాతం ఓటింగ్ తగ్గిందని, సెప్టెంబరు 3 నాటికి అది 10 శాతానికి పరిమితమైందని తెలంగాణ ఇంటెన్షన్స్ పేర్కొన్నది. గత వారం హంగ్ ప్రభుత్వం ఏర్పడుతుందంటూ గత వారం దాదాపు 6.2% మేర ప్రజలు అభిప్రాయపడగా ఈసారి అది మరో శాతం పెరిగి 7.2 శాతానికి చేరుకున్నదని పేర్కొన్నది.

# భయపడుతున్న చిరుతలు

**తిరుపతి, సెప్టెంబర్ 4:**

గత కొన్ని రోజులుగా తిరుమలలో చిరుత సంచారం భయాందోళనకు గురిచేస్తున్న సంగతి తెలిసిందే. దీని కోసం అధికారులు ఆపరేషన్ చిరుత కూడా చేపట్టి చిరుతల్ని పట్టుకున్నారు. తాజాగా అలిపిరి నడకమార్గం నరశింహస్వామి ఆలయ సమీపంలో చిరుత సంచారాన్ని గుర్తించారు. గతంలో ఇదే ప్రాంతంలో రెండు చిరుతలను అధికారులు ట్రాప్ చేశారు. ఇక నిరంతరాయంగా చిరుతల కదలికలను గుర్తించేలా ఏర్పాట్లు చేసిన అధికారులు ఇప్పటి వరకు నాలుగు చిరుతలను ట్రాప్ చేశారు. అదేవిధంగా నడకమార్గంలో శాశ్వత ప్రాతిపాదికన ట్రాప్ కెమెరాలను టీటీడీ ఏర్పాటు చేసింది.కేవలం తిరుమలలో మాత్రమే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చిరుతల సంచారం భయాందోళలకు గురిచేస్తోంది. తాజాగా శ్రీశైలంలో చిరుతపులి సంచారానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. నిన్న సాయంత్ర రుద్రాపార్కు సమీపంలోని గోడపై చిరుత కూర్చొని ఉండగా యాత్రికులు సెల్ ఫోన్ లో దానిని చిత్రీకరించారు. దీంతో స్థానిక ప్రజలు భయపడిపోతున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని లేదంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని విన్నవిస్తున్నారు. మరోవైపు రామ కుప్పం మండలంలో కూడా చిరుత హల్ చల్



చేసింది. పీఎంకే తాండాలో లేగ దూడపై దాడి చేసి చంపేసింది. తరచూ తమ ప్రాంతంలో చిరుత సంచరిస్తుందని తెలిపిన గ్రామ ప్రజలు.. అక్కడ ఉండాలంటేనే భయంగా ఉందంటూ, చిరుత బెడద నుంచి తమను కాపాడాలని వేడుకుంటున్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా చిరుతలు సంచారించడంతో ప్రభుత్వం అప్రమత్తమయ్యి వాటిని పట్టుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే ప్రసిద్ధ తిరుమలలో చిరత దాడిలో ఓ చిన్నారి చనిపోయిన విషయం తెలిసిందే. ఈ సంఘటన శ్రీవారి భక్తులను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది.తిరుమలలో కాలినడకన కొండపైకి వెళ్తున్న భక్తులు మెట్టు మెట్టుకూ భయంతో అడుగులు వేస్తున్నారు. శ్రీవారి మెట్టు నడక మార్గంలో బిక్కుబిక్కుమంటూ అడుగులో అడుగు వేస్తున్నారు. నల్లటి ఎలుగును చూడగానే.. భక్తులు పరుగులు పెడుతున్నారు. అది ఎక్కడ తమపై దాడి చేస్తుందోనని భయంతో వణికిపోతున్నారు. దీంతో అప్రమత్తమైన టీటీడీ అధికారులు గాలిస్తున్నా.. దాని జాడ మాత్రం ఇప్పటికీ కనిపెట్టలేకపోయారు. చిరుత, ఎలుగుబంటి. ఈ రెండు బంధిస్తే నడక మార్గంలో ఆపరేషన్ క్లోజ్ అవుతుందని అటవీ అధికారులు భావించారు. అయితే ఎలుగుబంటి ఏమైందో మాత్రం ఇప్పటిదాకా చెప్పలేక పోతున్నారు. నాలుగు చిరుతలను పట్టిన అటవీ శాఖ ఎలుగుబంటిని మాత్రం పట్టలేకపోతోంది.శ్రీవారి మెట్టు మార్గం, అలిపిరి నడకమార్గం రెండుచోట్ల హడావిడి చేస్తున్న ఎలుగుబంటిని బంధించడం ఇప్పుడు సవాలుగా మారింది. నాలుగు బోన్లను ఎలుగుబంటి ఆపరేషన్ కోసమే వినియోగిస్తున్న అటవీశాఖ 150 మంది సిబ్బందిని కూడా వినియోగిస్తోంది. అయితే తెలివిగా వ్యవహరిస్తున్న ఎలుగుబంటి సిబ్బంది కి దొరక్కుండా వలలో చిక్కకుండా రెండు నడక మార్గాల్లో సంచరిస్తూనే ఉంది. టీటీడీ తోపాటు అటవీ శాఖ సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తున్నా.. ఎలుగుబంటిని బంధించడం గగనమవుతుంది. ట్రాప్ కెమెరాల్లోనే కనిపించడమే కాదు.. ఏకంగా భక్తుల ముందు దర్జాగా నడక మార్గం దాటుతున్నా దొరక్కుండా తప్పించుకుంటుంది. తిరుమల నడక మార్గాల్లో చిరుతల సంగతి ఓకే.. ఎలుగుబంటి మాటేమిటన్న ప్రశ్న ఇప్పుడు భక్తుల్లో భయం పుట్టిస్తోంది.

# నగరంలో జడి వాన ట్రాఫిక్ జాములు

**హైదరాబాద్**

సోమవారం ఉదయం నగరంలో వాన దంచికొట్టింది. కూకట్ పల్లి, కెపిహెచ్బి, నిజాంపేట, ప్రగతి నగర్ బాచుపల్లి తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. . ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో సాధారణ జన జీవనానికి అంతరాయం కలిగింది. సుమారు నెల రోజుల తర్వాత హైదరాబాదులో వర్షం కురిసింది. నిన్న మొన్నటి వరకు మొన్నటి వరకు ఉక్కపోత, ఎండలతో ఎండాకాలాన్ని తలపించిన నగర వాతావరణం ఒక్కసారిగా మారింది.

వానల నేపథ్యంలో ఐటీ కారిడార్ లో భారీగా ట్రాఫిక్ జాం అయింది. రాయదుర్గం నుంచి హైటెక్ సిటీ మార్గంలో కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కొండాపూర్ హాఫీజ్ కెట్ మార్గంలో కుడా ట్రాఫిక్ స్థంభించింది. పది నిమిషాల ప్రయాణానికి గంటకు పైగా టైం పడుతోంది. రోడ్లపై వాన నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కున్నారు.

## బేగ్ ను ఎమ్మెల్యే చేస్తాను

**విజయవాడ**

మూడోసారి పోటీ చేసి లోక్ సభలో అడు గుపెడతానని విజయవాడ ఎంపీ కేశినేని నాని కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎంఎస్ బేగ్ ను ఎమ్మె ల్యే చేసే బాధ్యత తనది చెప్పుకొచ్చా రు. విజయ వాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్ ఎస్ బేగ్ పుట్టినరోజు వేడుకల్లో విజయవాడ ఎంపీ కేశినేని నాని ఆసక్తి కర కామెంట్స్ చేశారు. పశ్చిమ నియోజకవర్గ నుంచి ఎమ్మె ల్యే బేగ్ తండ్రి ఎంకే బేగ్ ప్రజాసేవలో ప్రజలకు దగ్గర మన్నల్నిపొందారని గుర్తు చేశారు. అదే విధంగా వారి కుటుంబం నుంచి వచ్చిన ఎంఎస్ బేగ్ ను అందరించా లని ఆదరించాలని కోరారు. ఇదే పశ్చిమ నియోజక వర్గం నుంచి గత ఎన్నికల్లో తనకు మెజార్టీ వచ్చిందన్న నాని?. రేపు రానున్న 2024 ఎన్నికల్లో ఎంఎస్ బేగ్ ను చట్టసభల్లోకి పంపించబోతు న్నానంటూ కామెంట్స్ చేశారు. దానికి మీ అందరి సహకారం, ఆదరణ కావాలన్నారు.

## ములుగు ఎమ్మెల్యే సీతక్క పీఏ దుర్మరణం

**హైదరాబాద్**

తెలంగాణ ఎమ్మెల్యే సీతక్క తన వ్యక్తిగత పీఏ వెంకట నారాయణ అంత్యక్రియల్లో కన్నీరు పెట్టుకున్నారు. ఆయన మరణం తీరని లోటని వెంకట నారాయణ కుటుంబానికి పార్టీ తరుపు న అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఓ వైపు వర్షం కురుస్తున్న సీతక్క స్వయంగా అంత్యక్రియల్లో పాల్గొన్నారు.కాగా, నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట నారాయణ మరణించారు.

## బస్సు ప్రయాణికులను కాపాడిన ప్రమాదం



**పల్నాడు**

ఓరోడ్డు ప్రమాదం బస్సు ప్రయాణికులను కాపాడింది. శ్రీశైలం నుంచి తెలంగాణ రాష్ట్రంలోని మునుగోడు కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దాంతో బస్యసు అదుపు తప్పింది. ఆదే సమయంలో నరసరావుపేట వైపు నుంచి వెళ్తున్న నవత ట్రాన్స్ పోర్ట్ లారీ అనుకోని విధంగా ఆ బస్సుకు ఢీకొట్టింది. అదుపు తప్పిన బస్సు అక్కడికక్కడ ఆగిపోయి ప్రమాదం నుంచి తప్పించుకుంది.బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన పెట్లూరు వారి పాలెం, ఉప్పలపాడు మధ్య చోటు చేసుకుంది. ఎవరికీ ఎటువంటి గాయాలు అవలేదు లారీ ముందు భాగం కొంతమేర దెబ్బతింది.

## మహదేవపూర్ లో బంద్ ప్రశాంతం

**భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని మహాదేవపూర్ ను రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని సోమవారం బంద్ కు అఖిలపక్షం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో మహాదేవపూర్ లో బంద్ కొనసాగింది. పాఠశాలలు, వ్యాపార వాణిజ్య సంస్థలు బందులో స్వచ్ఛందంగా పాల్గొన్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి మహాదేవపూర్ ను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని అఖిల పక్షం డిమాండ్ చేసింది. రెవెన్యూ డివిజన్ ప్రకటించే దాకా ఆందోళనాచేస్తామని హెచ్చరించింది.

## ఆలయ రికార్డుల్లో నమోదు కాని బంగారం

**మెదక్**

ఏడు పాయల ఆలయం ఈవో సారా శ్రీనివాస్ లీలలు విచారణలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గతంలో ఏడు పాయల అమ్మవారి బంగారాన్ని ఈవో సారా శ్రీనివాస్ ఇంట్లో పెట్టుకున్నారు. ఈ ఘటన మరవకముందే తునికి నల్లపోచమ్మ బంగారు చైన్ మాయమైన ఘటన తెరపైకి వచ్చింది. 2018లో తునికి నల్ల పోచమ్మ అమ్మవారికి ఐదు తులాల బంగారు చైన్ ను ఎమ్మెల్యే మదన్ రెడ్డి బహుకరించారు. ఆ సమయంలో ఆలయ ఈవోగా సారా శ్రీనివాస్ విధులు నిర్వహించారు. ఎమ్మెల్యే బహూకరించిన చైన్ దేవాలయ రికార్డుల్లోనూ నమోదు కాలేదు. తాజాగా ఈ విషయం బయటకు వచ్చింది.

## వికారాబాద్ లో అతిభారీ వర్షం

### పొంగిపొర్లుతున్న వాగులు వంకలు

**వికారాబాద్**

వికారాబాద్ జిల్లాలో సోమవారం అతి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపోర్తుతున్నాయి. వికారాబాద్ పట్టణంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పంట పొలాలు నెలకోరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ధారూర్ మండలం దోర్నాల్, నాగసమందర్ గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యయి. వాగులు రోడ్డుపై పారుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. వాగుల సమీపంలో పోలీసు సిబ్బందిని ఉంచారు.

# మోదుగులకా... లావుకా

**గుంటూరు, సెప్టెంబర్ 4:**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఆయనో ఫైర్ బ్రాండ్. మనసుకు ఏది అనిపిస్తే అది కుండ బద్దలు కొట్టాల్సిందే. ఈ ముక్కుసూటి తనమే ఆయన రాజకీయ జీవితానికి ఇబ్బందికరంగా మారింది. ఒకానొక సందర్భంలో మైక్ పట్టుకున్నారంటే సొంత పార్టీ అని కూడా ఆలోచించరు. ఇక ఎడాపెడా మాట్లాడాల్సిందే. మరోవైపు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజినీతో ఎంపీకి అసలు పొసగదు. అంతేకాదు విడుదల రజినీకి వ్యతిరేకంగా మర్రి రాజశేఖర్‌తో కలిసి ఓ వర్గాన్ని సైతం ఏర్పాటు చేశారనే ప్రచారం కూడా ఉంది. ఇంతకీ ఆ ఎంపీ ఎవరో తెలిసే ఉంటుంది కదూ. ఇంకెవరు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు. అయితే శ్రీకృష్ణ దేవరాయులు వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తారనే ప్రచారం కూడా జరుగుతుంది. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఎంపీగా పోటీ చేసేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎంపీగా ఉండటం వల్ల ప్రజల్లోకి చొచ్చుకుని వెళ్లలేకపోతున్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు అభిప్రాయపడుతున్నారు.కేవలం ఎంపీగా బహిరంగ సమావేశాలకు వెళ్లి ఏదో మె?క్కుబడిగా పాల్గొని... ప్రసంగాలకే పరిమితం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అసమ్మతి సెగ వచ్చే ఎన్నికల్లో ఇబ్బందికరంగా మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును పొన్నూరు ఎమ్మెల్యేగా బరిలోకి దిగాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనను ఇప్పటికే ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు వైసీపీ అధిష్టానం వద్ద ఉంచినట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అత్యంత సన్నిహితుడు అయిన ప్రస్తుత రాజ్యసభ సభ్యులు ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించాలనే యోచన వైసీపీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌కు వైసీపీ అధిష్టానం వద్ద మంచి పట్టుంది. అంతేకాదు ఉమ్మడి గుంటూరు జిల్లాలో కూడా నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీకి పెద్దదిక్కుగా వ్యవహరిస్తున్నారు. అంతేకాదు మత్స్యకార సామాజిక వర్గానికి కొండంత అండగా నిలుస్తున్నారు. ఈ పరిణామాలు మోదుగుల వేణుగోపాల్ గెలుపునకు దోహదపడతాయనే ప్రచారం ఉంది.

# పశ్చిమ డెల్టాలో ఎండిపోతున్న పంటలు

**గుంటూరు, సెప్టెంబర్ 4:**

వాన చుక్క రాలదు. కాలువలో నీరు పారదు. కళ్ల ముందే సాగు చేస్తున్న పైరు ఎండిపోతుంటే ఆకాశం వైపు చూపు నిలవదు. సాగు తప్ప మరోటి తెలియని అన్నదాతల వేల రూపాయల పెట్టుబడి పెట్టి సాగునీటి కోసం నిరీక్షిస్తున్నాడు. వాన దేవుడు కరుణించకపోతాడా? కాలువలో ఒక్క తడికైనా నీరు రాకపోతుందా అన్న ఆశతో జీవనం సాగిస్తున్నాడు. పల్నాడు ప్రాంతంతో పాటు గుంటూరు జిల్లాలోనూ సాగు నీటి కొరత నెలకొంది. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో తీవ్ర సాగు నీటి ఎద్దడి నెలకొంది. వర్షాలు సకాలంలో రాకపోవడం ఒక వైపు ప్రాజెక్టుల్లో నీరు చేరకపోవడంతో పంటలు సాగు చేసేందుకు అవసరమైన నీరు అందటం లేదు. దీంతో కొద్దిపాటి వర్షానికి సాగు మొదలు పెట్టిన రైతన్నలు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు.గుంటూరు జిల్లాలోని కృష్ణా పశ్చిమ డెల్టాలో యాభై ఐదు వేల హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. ప్రకాశం బ్యారేజ్ వద్ద నుండి కృష్ణా పశ్చిమ కెనాల్ ద్వారా సాగునీరు గుంటూరు జిల్లాలోని డెల్టా ప్రాంతానికి అందుతుంది. పశ్చిమ కాలువను పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించారు. అయితే ప్రతి ఏటా ఆరు వేల నుండి ఏడు వేల క్యూసెక్కుల నీటిని ఈ సీజన్ లో వదులుతారు. దీంతో తగినంత నీరు ఉండి రైతులు తమ పంటలు సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది మాత్రం నాలుగు వేల క్యూసెక్కుల నీరు మాత్రమే పశ్చిమ కాలువకు విడుదల చేస్తున్నారు. దీంతో తెనాలి రూరల్ మండలంలోని బ్రాంచ్ కెనాల్ కింద సాగవుతున్న భూములకు నీరు అందటం లేదుఇప్పటికే ఎకరానికి కౌలు కాకుండా పదివేల రూపాయల పెట్టుబడి పెట్టిన రైతన్నలు పంటను రక్షించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంజన్లు, మోటార్ల ద్వారా నీళ్లను పంటలకు మళ్లిస్తున్నారు. కాలువలపై ఉన్న మోటార్లు నడవటానికి అవసరమైన విద్యుత్ కూడా లేకపోవడంతో ఇంజన్లనే నమ్ముకుంటున్నారు. అయితే వరి అత్యధికంగా సాగు చేస్తుండటంతో సకాలంలో అన్ని ఎకరాలను నీటిని పెట్టుకోలేకపోతున్నారు. మరో పది రోజుల్లో వర్షాలు లేకపోతే ఈ ఏడాది ఖరీఫ్ పంట పోయినట్లేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతులు. మినుము, పెసర వంటి పంటలను జనవరి తర్వాతే సాగు చేసే అవకాశం ఉంటుందంటున్నారు. దీంతో వేసిన పంటను ఎలాగైనా రక్షించుకోవాలన్న తపనతో పొలం గట్లపైనే రైతన్నలు కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాలు లేక పంటలపై ఆధారపడ్డ రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సాగు నీటి కరువుతో పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు.

# విశాఖలో మరో పర్యాటక మణిహారం

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 4:**



విశాఖ సిటీ సిగలో మరో ప్రతిష్టాత్మక పర్యాటక మణిహారం చేరనుంది. సముద్ర విహారంపై ఆసక్తి చూపే పర్యాటకుల కోసం విశాఖ పోర్టులో క్రూయిజ్ టెర్మినల్ ముస్తాబైంది. వివిధ దేశాల పర్యాటకులు క్రూయిజ్‌లో వచ్చి విశాఖ నగరంలో పర్యటించేలా ఈ టెర్మినల్‌లో వివిధ ఏర్పాట్లు చేశారు. పోర్టులోని గ్రీన్ చానల్ బెర్త్‌లో రూ.96.05 కోట్లతో ఈ సముద్ర విహార కేంద్రాన్ని నిర్మించారు. ఇందుకోసం కేంద్ర టూరిజం శాఖ 38.50 కోట్ల రూపాయలు కేటాయించింది. క్రూయిజ్ షిప్స్‌తోపాటు భారీ కార్గో నౌకల హ్యాండ్లింగ్‌కు అనుగుణంగా క్రూయిజ్ టెర్మినల్‌ను తీర్చిదిద్దారు. సోమవారం కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభించనున్నారు. భారత్‌లో క్రూయిజ్ టూరిజానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ టెర్మినల్ నిర్వహణలో ఏపీ టూరిజం, కేంద్ర టూరిజం శాఖలతో కలిసి విశాఖపట్నం పోర్టు పని చేయనుంది. ప్రస్తుతం 7.1 యూఎస్ బిలియన్ డాలర్ల మార్కెట్ ఉంది. రానున్న పదేళ్లలో 12.1 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా. ప్రపంచవ్యాప్తంగా క్రూయిజ్ రంగం 1.17 మిలియన్ల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. దీని కారణంగా ఆంధ్రప్రదేశ్ లో కూడా పర్యాటక రంగం వృద్ధి చెందటంతో పాటు ఉద్యోగ కల్పన కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో బీచ్‌లు, కొండలు, గుహలు, వైల్డ్ లైఫ్, అడవులు, ఆలయాలు వంటి విభిన్న రకాల పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. దేశీయ పర్యాటక ప్రదేశాలలో ఆంధ్రప్రదేశ్ 14 శాతం పర్యాటకులను అకట్టుకుంటూ దేశంలో మూడో ప్లేస్‌లో ఉంది. అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య ఏటా పెరుగుతోంది. క్రూయిజ్ సేవలు ప్రారంభమైతే రాష్ట్రంలో ఇంటర్నేషనల్ టూరిజం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.2000 మంది ప్యాసింజర్లను తీసుకువెళ్లే సామర్థ్యం కలిగిన వెసెల్స్‌ను నిర్వహించే సామర్థ్యం ఈ టెర్మినల్ సొంతం. టెర్మినల్ పార్కింగ్ ప్రాంతంలో 7 బస్సులు, 70 కార్లు, 40 బైక్‌లు నిలిపేలా ఏర్పాట్లు చేశారు. 2,500 చదరపు మీటర్లలో టెర్మినల్ బిల్డింగ్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, విదేశీ కరెన్సీ మార్పిడి కౌంటర్‌లు, గ్యాంగ్ వే, రెస్టారెంట్, స్పెషల్ లాంజ్, షాపింగ్, రెస్ట్ రూమ్స్, టూరిజం ఆపరేటర్స్ కౌంటర్లు ఏర్పాటు చేసే విధంగా నిర్మాణాలు పూర్తిచేశారు. క్రూయిజ్‌లో వచ్చే అంతర్జాతీయ పర్యాటకుల చెకింగ్ కోసం ప్రత్యేకంగా ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ క్యాబిన్స్, పర్యాటకులు సేదతీరేందుకు టూరిస్ట్ లాంజ్ నిర్మించారు. గంటకు 200 కి.మీ. వేగంతో వీచే గాలులను సైతం తట్టుకునేలా షోర్ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తున్నారు. రెగ్యులర్ బెర్త్ 180 మీటర్ల పొడవు ఉంటుంది. ఈ టెర్మినల్‌లో 330 మీటర్ల భారీ పొడవైన క్రూయిజ్ బెర్త్ నిర్మించారు. 15 మీటర్ల వెడల్పు, 9.50 మీటర్ల డ్రెడ్జ్ డెప్త్‌ని నిర్మించారు. తద్వారా క్రూయిజ్ రాని సమయంలో సరుకు రవాణా చేసే భారీ కార్గో నౌకలను కూడా ఈ బెర్త్‌లోకి అనుమతించేలా డిజైన్ చేశారు.కేంద్ర ఓడరేవులు, జల రవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్, సహాయ మంత్రి శ్రీపాద నాయక్ విశాఖలో పర్యటిస్తున్నారు. విశాఖపట్టణం పోర్టు ట్రస్ట్ అభివృద్ధి ప్రణాళికలపై ఉన్నతాధికారులు, పలువురు మంత్రులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రూ.333.56 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు.

## హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ లో చోరీ యత్నం

**గుంటూరు**

మంగళగిరి హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ లో దొంగలు చోరీకి ప్రయత్నించారు. షట్టర్ తాళాలు పగలగొట్టి ముగ్గురు దొంగలు బ్యాంక్ లోకి ప్రవేశించారు. పోలీస్ పెట్రోలింగ్ సైరన్ మోగడంతో పారిపోయారు. ఘటన సోమవారం తెల్లవారుజాము 3: 40 నిమిషాల సమయంలో జరిగింది. చోరీ యత్నంకు సంబంధించిన వీడియోలు సీసీటీవీలో రికార్డయ్యాయి. మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ఎల్బీ నగర్ టికెట్ మధు యాష్కికి ఇవ్వొద్దు

**హైదరాబాద్**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మధుయాష్కీ కి ఎల్బీనగర్ నుండి టికెట్ ఇవ్వద్దని ఎల్బీనగర్ లో కాంగ్రెస్ నేతలు పోస్టర్లు అంటించారు. ఆవే పోస్టర్లు గాంధీభవన్ లో కుడా కనిపించి కలకలం రేపాయి. సేవ్ ఎల్బీనగర్ కాంగ్రెస్, గో బ్యాక్ టు నిజామాబాద్ అంటూ మధు యాష్కిని ఉద్దేశించి పోస్టర్లు అతికించారు.

## గురునానక్ కాలేజీ దగ్గర ఉద్రిక్తత

**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం గురునానక్ కాలేజీ దగ్గర తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కళాశాలలో కోర్సులకు యూనివర్సటీ రూ.లక్షలు వసూలు చేసి ఇప్పుడు ప్రభుత్వం అనుమతి లేదని యాజమాన్యం చేతులెత్తేసింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన దిగారు. దీంతో గురునానక్ కాలేజీ లోపల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మణుగూరులో గడప గడపకు కాంగ్రెస్

**ఖమ్మం**

పినపాక నియోజకవర్గం మణుగూరులోని సుందరయ్య నగర్, శ్రీ శ్రీ నగర్, వినాయకనగర్ లో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ పాదయాత్రలో మాజీ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గోన్నారు. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్స్ కి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరిన పలు కుటుంబాలు కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు ,ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో వరుస చోరీలు

**నెల్లూరు**

నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం మందాల నాయుడు పల్లి గ్రామంలోని దేవాలయాల్లో దొంగలు పడ్డారు. గ్రామం లోని పలు దేవాలయాల్లో దుండగులు చోరీ చేసారు. ఆదివారం రాత్రి పలు దేవాలయాల్లో ని హుండీలను, దేవతల కు సంబంధించిన మంగళసూత్రాలు,ఆభరణాలు ను దొంగలు చోరీ చేశారు.

## మహిళ దారుణ హత్య

**నెల్లూరు**

నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం బట్టేపాడు గ్రామం లో దేశిరెడ్డి నీలమ్మ అనే మహిళను గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి దారుణంగా హత్య చేశారు.అనంతరం బీరువాలో ఉన్న నగదు, బంగారం దొంగలించినట్టు సమాచారం.. రోజు ఉదయాన్నే లేచి బయట వచ్చే నీలమ్మ బయటికి రాకపోడంతో చుట్టుపక్కల వారు ఇంట్లో గమనించగా నీలమ్మ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు

## బజాజ్ షోరూం ను ప్రారంభించిన మండలి ఛైర్మన్

**దేవరకొండ**

దేవరకొండ పట్టణంలో బజాజ్ బైక్స్ షో రూమ్ ని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ నాయక్ సోమవారం ప్రారంభోత్సవం చేసారు. తరువాత బైక్ కొనుగోలు చేసిన వాహనదారునికి బైక్ కీ అందజేసి తప్పకుండా హెల్మెట్ ధరించి డ్రైవ్ చేయాలని ,వేగం కన్నా ప్రాణం మిన్న అనేది ఎప్పుడు గుర్తుపెట్టుకోవాలని గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నర్సింహ ,ఎంపిపి జానీ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవేందర్ నాయక్, తదితరులు కూడా పాల్గొన్నారు.

## సనత్ నగర్ లో మంత్రుల పర్యటన

**హైదరాబాద్**

విదేశాలలో విద్యను అభ్యసించే స్థాయికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దుతామని మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్ లో 2.22 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, బన్సీలాల్ పేట లోని ప్రభుత్వ పాఠశాలలో 1.84 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మంత్రులు ప్రారంభించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి మేకల మండి పాఠశాలను హై స్కూల్ గా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు విద్యా శాఖ మంత్రి ప్రకటించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు పేద విద్యార్థులు అధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో మన బస్తీ మన బడి కార్యక్రమంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నాం . తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సన్నబియ్యం తో నాణ్యమైన భోజనం, వారానికి 3 రోజులు రాగిజావా అందిస్తున్నాని అన్నారు.

# గుడివాడ టిక్కెట్ వెనిగండ్లకే..

**విజయవాడ, సెప్టెంబర్ 4:**

ఉమ్మడి కృష్ణా జిల్లాలో కీలకమైన స్థానాలకు అభ్యర్థుల ఎంపికను తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు వేగవంతం చేశారు. కృష్ణా జిల్లాలో తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న స్థానాల్లో గన్నవరం, గుడివాడ ముఖ్యమైనవి. ఈ రెండు స్థానాల్లో ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఒకప్పుడు టీడీపీ నుంచి గెలిచి వైసీపీలో చేరిన వారు ఉన్నారు. గన్నవరం నుంచి వల్లభనేని వంశీ, గుడివాడ నుంచి కొడాలి నాని ఇద్దరూ కూడా టీడీపీ రాజకీయ జీవితం ప్రారంభించినవారే. వైసీపీలో చేరిన తర్వాత చంద్రబాబుతో పాటు తెలుగుదేశం పార్టీ నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. అందుకే ఈ ఇద్దరినీ వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ గడప తొక్కకుండా చూడాలని గట్టి పట్టుదలతో ఉన్నారు చంద్రబాబు. ఇప్పటికే గన్నవరం నుంచి వంశీకి పోటీగా యార్లగడ్డ వెంకట్రావు?కు టిక్కెట్ కన్ఫర్మ్ చేశారు. మరో స్థానం గుడివాడ. ఒకప్పుడు టీడీపీ నుంచి రెండుసార్లు గెలిచి ఆ తర్వాత వైసీపీలో చేరారు కొడాలి నాని. వరుసగా వైసీపీలో కూడా రెండుసార్లు గెలిచారు. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొడాలి నానిని ఢీకొట్టాలంటే సామాజికంగా,ఆర్థికంగా బలమైన నేత ఉండాలనేది చంద్రబాబు ఆలోచన. ప్రస్తుతం గుడివాడ టీడీపీ ఇంఛార్జిగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు ఉన్నారు. ఈయనతో పాటు మరో ఎన్నారై వెనిగండ్ల రాము కూడా గతేడాది దసరా నుంచి టీడీపీలో చురుకుగా ఉన్నారు. దీంతో ఈ ఇద్దరూ కూడా టీడీపీ టిక్కెట్ కోసం పోటీ పడుతున్నారు. ఈ ఇద్దరిలో టిక్కెట్ ఎవరికి ఇవ్వాలి అనేదానిపై చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.కొడాలి నానిని ఢీ కొట్టేందుకు చంద్రబాబు



పక్కా స్కెచ్ ప్రస్తుతం గుడివాడ టీడీపీ ఇంఛార్జిగా ఉన్న రావి వెంకటేశ్వర రావు గతంలో ఒకసారి ఎమ్మెల్యే గా గెలిచారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మరోవైపు కొన్నేళ్ల క్రితం అమెరికాలో స్థిరపడిన వెనిగండ్ల రాము? స్వస్థలానికి వచ్చి ఈసారి టిక్కెట్ ఎలాగైనా దక్కించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. రావి వెంకటేశ్వరరావుతో సమానంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలతో ప్రజలోనే ఉంటున్నారు. సుమారు ఏడాదిగా అన్న క్యాంటీన్ లు, పండగలకు దుస్తుల పంపిణీ, జాబ్ మేళాలు నిర్వహించడం,ఇటీవల వరదలు వచ్చినప్పుడు రైతులను పరామర్శించడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు చాలా దగ్గరయ్యారు రాము. దీంతో రావి, వెనిగండ్ల విషయంలో ప్రత్యేకంగా నివేదికలు తెప్పించుకున్నారు పార్టీ అధినేత చంద్రబాబు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉండటంతో టిక్కెట్?పై క్లారిటీ ఇవ్వాలని నిర్ణయానికి వచ్చారట. దీంతో రావి వెంకటేశ్వరరావుతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులను పిలిచి చంద్రబాబు మాట్లాడారు. తాజా నివేదికలను రావి వెంకటేశ్వరరావు ముందు ఉంచారట చంద్రబాబు. కొడాలి నానికి సరైన ప్రత్యర్థిగా వెనిగండ్ల రాముకే నివేదికలు అనుకూలంగా ఉన్నట్లు రావికి చెప్పినట్లు తెలిసింది. వెనిగండ్ల రాముకు టిక్కెట్ ఇవ్వడం ద్వారా సామాజిక వర్గాల పరంగాను ఇతర కోణాల్లోనూ నానిని ఢీకొట్టగల సత్తా ఉందని చెప్పారట బాబు. ఇదే సమయంలో రావి వెంకటేశ్వరరావుకు ఎమ్మెల్సీ లేదా మరో మంచి పదవి ఇచ్చి న్యాయం చేస్తానని చంద్రబాబు చెప్పినట్లు సైకిల్ పార్టీ నేతలు చెబుతున్నారుగత ఎన్నికల్లో కొడాలి నానికి పోటీగా దేవినేని అవినాష్?ను బరిలోకి దించారు చంద్రబాబు. అయితే దేవినేని అవినాష్ స్థానికేతరుడు. నియోజకవర్గంపై పట్టు లేదంటూ కొడాలి నాని ప్రచారం చేశారు. నాన్ లోకల్ ఇష్యూతో తెలుగుదేశం పార్టీకి నష్టం కలిగిందని నిర్ణయానికి వచ్చారు చంద్రబాబు. ఈసారి అలాంటి సమస్య లేకుండా వెనిగండ్ల రామును బరిలోకి దింపితే కచ్చితంగా సీటు గెలుస్తామనే అభిప్రాయానికి వచ్చారట బాబు. స్థానికుడు కావడం.. ఇప్పటికే అన్ని వర్గాలతో కలిసిపోవడం, ఆర్థికంగా కూడా బలంగా ఉండటం వెనిగండ్ల రాముకు కలిసొచ్చే అంశంగా చెబుతున్నారు. ఇక కొడాలి నాని హయాంలో గుడివాడ అభివృద్ధి జరగలేదని టీడీపీ ప్రచార అస్త్రంగా చేసుకుంది. తాను గెలిస్తే గుడివాడను ఎలా అభివృద్ధి చేస్తాను అనేది కూడా ప్రజల్లోకి తీసుకెళు న్నారు రాము. ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే రాముకు టిక్కెట్ ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలోనే వెనిగండ్ల రాముకు గుడివాడ ఇంఛార్జి బాధ్యతలు కూడా అప్పగిస్తారని సమాచారం. మొత్తానికి ఒక పక్క గన్నవరం,మరోపక్క గుడివాడ లో ఈసారి ఎన్నిక లు హోరాహోరీ జరిగే ఛాన్స్ ఉంది.

# మందమర్రిలో దారుణం

**అదిలాబాద్, సెప్టెంబర్ 4:**

మంచిర్యాల జిల్లా మందమర్రిలో దారుణం చోటు చేసుకుంది. మేకను ఎత్తుకెళ్లారనే నెపంతో మేక యజమానులు.... ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడ్డారు. దాడి చేయడమే కాకుండా తలకిందులుగా వేలాడదీసి, కింద నిప్పు పెట్టారు. అలా ఉండగానే కర్రలతో చితకబాదారు. మేకలను మాయం చేసింది మీరేనని ఒప్పుకోమంటూ వేధించారు. అలాగే మేక పోయినందుకు గాను 3 వేల రూపాయలు తమకు చెల్లించాలంటూ హింసించారు. ఈ అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కొమురాజుల రాములు, అతని భార్య స్వరూప, కుమారుడు శ్రీనివాస్ అంగడి బజార్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. యాపల్ ప్రాంతంలోని రైల్వే ట్రాక్ సమీపంలోని గంగనీళ్ల పంపుల వద్ద షెడ్డు వేసి మేకలు పెంచుకుంటున్నారు. అయితే ఈ మందను చూసుకోవడానికి 19 ఏళ్ల తేజ అనే యువకుడిని పనిలో పెట్టుకున్నారు. తేజనే మేకలు కాస్తూ వస్తున్నాడు. అయితే అతని తల్లి పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. ఈక్రమంలోనే ఎనిమిది రోజుల కిందట షెడ్డు నుంచి ఒక మేక కనిపించకుండా పోయింది. విషయం తెలుసుకున్న యజమాని తేజపై అనుమానం వ్యక్తం చేశాడు. నువ్వే మేకును దొంగిలించావంటూ వాదించాడు. అలాగే అదే ఏరియాకు చెందిన తాపీ మేస్త్రీ శ్రావణ్ వద్ద కూలీ పనులు చేస్తున్న చిలుముల కిరణ్ అనే వ్యక్తితో కలిసి మేకను దొంగిలించి ఉంటావంటూ తెలిపాడు. ఈక్రమంలోనే తేజతో పాటు కిరణ్ ను మేకల షెడ్డు వద్దకు రావాలని పిలిచాడు. అప్పటికే రాములుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా అక్కడే ఉన్నారు. వీరంతా ముందుగా తేజ, కిరణ్ లను దొంగతనం ఒప్పుకోమని గొడవ చేశారు. వారిద్దరూ తాము మేకను దొంగిలించలేదని ఎంత వాదించినా వినకుండా... వారిని తలకిందులుగా వేలాడదీశారు. ఆపై కింద నిప్పు పెట్టి మరీ కుటుంబ సభ్యులంతా కలిసి తీవ్రంగా కొట్టారు. మూడు వేల రూపాయలు ఇస్తే తప్ప వదిలిపెట్టేది లేదని అన్నారు. విషయం తెలుసుకున్న తాపీ మేస్త్రీ శ్రావణ్... డబ్బులు ఇస్తానని హామీ ఇచ్చి కిరణ్ ను విడిపించుకొని వెళ్లాడు. అయితే కిరణ్ కనిపించకుండా పోవడంతో అతని చిన్నమ్మ నిట్టూరి సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరపడంతో ఈ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. అలాగే సోషల్ మీడియాలో కూడా వీరిని కొడుతున్న వీడియోలు నెట్టింట వైరల్ గా మారాయి. దీంతో అలర్ట్ అయిన పోలీసులు మేకల యజమానులు అయిన రాములు, స్వరూప, వీరి కుమారుడు శ్రీనివాస్ తో పాటు దాడికి సహకరించిన మరో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఎనిమిది రోజుల క్రితం ఈ దారుణం జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది తేజను ఆస్పత్రికి తరలించగా.. దళిత యువకుడు కిరణ్ కనిపించకుండా పోవడం సంచలనంగా మారింది.

# ముందస్తు ముచ్చట లేదు....

**విజయవాడ, సెప్టెంబర్ 4:**

ఆంధ్ర ప్రదేశ్‌లో ఎన్నికలకు తొమ్మిది నెలలు టైమున్నా రాజకీయం మాత్రం రంజుగా సాగుతోంది. అధికార వైకాపా ఎన్నికల హామీలన్నీ దాదాపు నెరవేర్చి, అదే ఆత్మవిశ్వాసంతో సమరానికి సిద్ధమవుతోంది. తెలుగుదేశం అధ్యక్షుడు అడపా దడపా ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రయాణిస్తూ క్యాడర్‌లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. లోకేష్ పాదయాత్ర నిర్విఘ్నంగా కొనసాగుతోంది. పవన్ కల్యాణ్ వారాహి యాత్ర కూడా అభిమానుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి రాష్ట్ర కార్యవర్గాన్ని నియమించి పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు. దాదాపుగా పార్టీలన్నీ ఎన్నికల మూడ్‌లోకి వచ్చేశాయి. జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ కూడా తొందరలోనే తన నివేదికను ఇచ్చేస్తుంది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఆ బిల్లును ఆమోదిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఓ నాలుగు నెలల ముందే ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి.ఈ ఎన్నికలు రాష్ట్రంలోని అన్ని పార్టీలకీ అత్యంత ప్రతిష్ఠాత్మకం. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీకి జీవన్మరణ సమస్య. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రాలేకపోతే, ఆ పార్టీని కబళించడానికి బీజేపీ సిద్ధంగా ఉంది. పురంధేశ్వరిని అధ్యక్షురాలిని చేయడం వెనుక వ్యూహం కూడా అదేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలుగుదేశం కనుక ఈ సారి ఓడిపోతే, మళ్లీ కోలుకోలేకపోవచ్చు. ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. ఆ పరిస్థితుల్లో ఆ పార్టీకి వెన్నుదన్నుగా ఉండే సామాజిక వర్గానికి బీజేపీ తప్ప వేరే దారి ఉండదు. తెలుగుదేశం పూర్తిగా ఉనికిని కోల్పోవాలని కేవలం బీజేపీ మాత్రమే కాదు వైకాపా కూడా బలంగా కోరుకుంటోంది. దీనివల్ల రాష్ట్రస్థాయిలో ఓ బలమైన మీడియా అండ ఉన్న పార్టీ కనుమరుగు అవుతుంది. భాజపాలోకి తెలుగుదేశం నాయకులు వెళ్లినా, తెలుగుదేశం అనుకూల మీడియా కమలం పార్టీని ఏకపక్షంగా సపోర్ట్ చేయదు. ఆ మీడియాకు కూడా కొన్ని పరిమితులుంటాయి. దీనివల్ల అంతిమంగా తమకు లబ్ధి జరుగుతుందని జగన్ వర్గం భావిస్తోంది. జగన్‌తో పోరాడి రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రావడానికి చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జనసేన, బీజేపీ, కమ్యూనిస్టులు ఇలా అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ లోగా 118 కోట్ల 'వెల్లడిరచని ఆదాయం' వివరాలు చెప్పాలని ఆదాయ పన్ను శాఖ చంద్రబాబుకు నోటీసులు జారీ చేయడం, సైకిల్ పార్టీ వర్గాలకి మింగుడు పడని పరిణామం. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం అండ లేకపోతే చంద్రబాబు మరింత చిక్కుల్లో పడతారు. చంద్రబాబుకు ఐటీ నోటీసులపై ఆయన వర్గం మీడియా మౌనంగా ఉన్నా, జాతీయ మీడియా, సాక్షి, సోషల్ మీడియాలో వైకాపా అనుకూల, తెదేపా వ్యతిరేక గ్రూపులన్నీ ఓ రేంజ్‌లో రచ్చ చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు దగ్గర ఉన్నది కేవలం ఒకే ఆప్షన్. తాను అధికారంలోకి వచ్చినా రాకపోయినా, వచ్చే సారి జగన్‌కు పాలనా పగ్గాలు అందకూడదు. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో సగం అసెంబ్లీ స్థానాలను భాజపాకు పంచడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం. అదీ కుదరదంటే, తమ తండ్రీ కొడుకుల భవిష్యత్తుపై ఒకట్రెండు స్పష్టమైన హామీలు తీసుకుని తెదేపాను భాజపాలో విలీనం చేయడానికి కూడా సిద్ధపడుతున్నట్లు ఓ ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు వ్యాఖ్యానించారు. గతంలో తమ పార్టీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు భాజపాలో కలిసిపోయినా చంద్రబాబు పెద్దగా స్పందించలేదు. వాళ్లంతా ఇప్పటికీ ఆయనతో 'టచ్' ఉన్నారు. తన ఉనికిని కాపాడుకోవడం కోసం ఏ ఆప్షన్‌నూ చంద్రబాబు వదులుకోరని ఆయనతో పరిచయమున్న వాళ్లు చెబుతుంటారు. చూద్దాం ఏ జరుగుతుందో..!

# చల్లారిన అసంతృప్తులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌లో స్తబ్దత నెలకొంది. ఎన్నికల టైం దగ్గర పడుతున్నా అభ్యర్థుల విషయంలో ఇంకా స్పష్టత రాలేదని అసహనంగా ఉన్నాయి పార్టీ శ్రేణులు. అధికార పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో ప్రచారానికి సిద్ధమవుతున్నారు. అదే సమయంలో అసలు కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థుల కొరత ఉందని విమర్శలు గుప్పిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. నిన్న, మొన్నటి దాకా తీగల కృష్ణారెడ్డి, మహేందర్ రెడ్డి లాంటి సీనియర్స్ కారు పార్టీకి బైబై చెప్పి కాంగ్రెస్ లోకి వస్తారని గంపెడాశలు పెట్టుకున్నారు కాంగ్రెస్ నేతలు. కొందరైతే? బీఆర్ఎస్ నేతలతో రహస్య సమావేశాలు జరిపి సీట్ల కేటాయింపుతో పాటు ఇతర అంశాలపై పెద్ద ఎత్తునే చర్చలు నిర్వహించారు. అయితే అధికార పార్టీ?సిట్టింగ్‌లకు సీట్లు ఇవ్వడంతో పాటు ఆశావాహులందరిని ప్రగతి భవన్‌కు పిలిచి వారికి కావాల్సిన హామీలు ఇచ్చి దారికి తెచ్చుకోవడంతో.. మొదట్లో కాస్త కనిపించినా? క్రమంగా అసంతృప్తులు చల్లబడ్డాయి. దీంతో కాంగ్రెస్ నేతలు కంగుతింటున్నారట.ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు చాలా మంది కారు దిగి చెయ్యి పట్టుకుంటారని అనుకున్నా? ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా ఆ వాతావరణమే కనిపించడం లేదంటున్నారు. బీఆర్ఎస్ వలసలపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ నేతలు అలాంటి వాతావరణం కనిపించకపోవడంతో ఇక బీజేపీలోని జిల్లాకు చెందిన బలమైన నేతలకు గాలం వేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అటు బీఆర్ఎస్ అసంతృప్తులపై బీజేపీ సైతం ఆశలు పెట్టుకున్నా? ఉపయోగం లేకుండా పోయిందట.ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉమ్మడి రంగారెడ్డిలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు బలమైన అభ్యర్థులు కరువయ్యారన్నది పార్టీ వర్గాల మాట. ఉదాహరణకు మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డి బరిలో ఉన్నారు. మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి అసంతృప్తితో బయటికి వస్తే .. మహేశ్వరం టిక్కెట్ ఇచ్చి సబిత మీద పోటీ పెడదామనుకున్నారట కాంగ్రెస్ నాయకులు. కానీ.. ఆ ఆశలు నెరవేరలేదు. ప్రస్తుతం అక్కడ బడంగ్‌పేట్ మేయర్ పారిజాత, డిసిసి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, దేపా భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి లాంటి చాలా మంది నేతలు టిక్కెట్ ఆశిస్తున్నా? వారిలో ఎవరికీ సబిత స్థాయి లేదని పార్టీలోనే చర్చ నడుస్తోంది. గెలుపు సంగతి పక్కనపెడితే?వీరిలో ఎవరికీ కనీస పోటీ ఇచ్చే సామర్థ్యం లేదంటున్నారు.దీంతో ప్రస్తుతం మహేశ్వరం కాంగ్రెస్ దిక్కు మొక్కు లేకుండా ఉందట. ఇక ఎన్నికలకు సమయం పెద్దగా లేకపోవడంతో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన పెరుగుతోంది. ఇద్దరు ముగ్గురు పోటీలో ఉంటే? ఎవరో ఒకరికి టిక్కెట్ ఇస్తారు?మనం బరిలో ఉంటామన్న ధీమాతో పనిచేయవచ్చు. కానీ? అసలు అభ్యర్థి ఎవరో తెలీదు, పని చేయాలన్న ఉత్సాహం ఎలా వస్తుందని అడుగుతున్నారట కార్యకర్తలు.

# కాంగ్రెస్ లో అంతా సీక్రెట్...

**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ఎంపిక కసరత్తులో వేగం పెంచింది. తెలంగాణ అసెంబ్లీ అభ్యర్థుల విషయంలో పూర్తి గోప్యత పాటిస్తోంది. ప్రదేశ్ ఎన్నికల కమిటీ నివేదిక సోమవారం స్క్రీనింగ్ కమిటీ ముందుకు చేరనుంది. గాంధీభవన్‌లో ఉదయం 11 నుంచి పీఈసీ సభ్యులతో స్క్రీనింగ్ కమిటీ వ్యక్తిగతంగా సమావేశం అయింది. సాయంత్రం వరకు ఈ ముఖాముఖి సమావేశాలు కొనసాగాయి. కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించే జాబితానే ఫైనల్. తర్వాత మంగళవారం గాంధీ భవన్‌లో పీఈసీలో లేని మాజీ మంత్రులు, మాజీ ఎంపీలతో స్క్రీనింగ్ కమిటీ భేటీ కానుంది. పీఈసీ, ఇతర సీనియర్ నేతల అభిప్రాయం మేరకు 6 తేదీన అభ్యర్థుల ఎంపికపై నివేదికను సిద్ధం చేస్తుంది. 7 తేదీన సెంట్రల్ ఎలక్షన్ కమిటీకి నివేదిక సమర్పిస్తుంది. ఆ తర్వాతే కాంగ్రెస్ తరపున అభ్యర్థుల జాబితా ప్రకటన వెలువడనుంది. ఈ మొత్తం ప్రాసెస్‌లో ఏం జరుగుతుందో తనకు కూడా తెలియదని తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ రేవంత్ రెడ్డి చెప్పడం విశేషం. అయితే ఈసారి బీసీలకు పెద్ద పీట వేయబోతున్నామని ఆయన చెబుతున్నారు. ప్రదేశ్ ఎన్నికల కమిటీ సభ్యులు ఆదివారం గాంధీభవన్‌లో తమ తమ అభిప్రాయాలతో అభ్యర్థుల పేర్లతో నివేదిక రూపొందించిన సంగతి తెలిసిందే. నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లకు ముందు టిక్‌ను ఉంచారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ 1006 దరఖాస్తులను పరిశీలించింది. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి విధివిధానాలను ఈ సమావేశంలో చర్చించారు. నియోజకవర్గాల వారీగా ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో జాబితాను రెడీ చేశారు. నియోజకవర్గాల వారీగా అర్జీలను వేర్వేరుగా పరిశీలించారు. అలాగే బీసీలకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల సంఖ్యను కూడా నియోజకవర్గాల వారీగా వేరు చేసి పరిశీలించారు. దరఖాస్తుదారుడి పేరు? ఎప్పటి నుంచి పార్టీలో ఉంటున్నారు? ఏ హోదాలో ఉన్నారు? పుట్టిన తేదీ, కులం, ఉప కులాలు వివిధ రకాల సమాచారంతో కూడిన 500పేజీల ఈ బుక్‌లెట్‌ను పీఈసీ సభ్యులకు అందజేశారు. ఈ వివరాల ఆధారంగా ఒక్కో నియోజకవర్గానికి రెండు, లేక మూడు పేర్లు సూచిస్తూ వెయ్యి మంది నుంచి రెండు మూడు వందల మందికి కుదించి జాబితా సిద్ధం చేశారు.ఇప్పటికే 35 నుంచి 40 నియోజకవర్గాల్లో అభ్యర్థులపై క్లారిటీ వచ్చిందని సమాచారం. మిగతా నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ (పీఈసీ) ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. పీఈసీ సభ్యులతో ఇవాళ స్క్రీనింగ్ కమిటీ సమావేశమై ఆ సీల్డ్ కవర్‌ను పరిశీలిస్తుంది. వాళ్ల నుంచి ఆయా అభ్యర్థుల ఎంపికకు గల కారణాలను స్క్రీనింగ్ కమిటీ అడిగి తెలుసుకోనుంది. పార్టీకి ఆయా నియోజకవర్గాల్లో బలం ఎంత ఉంది? అభ్యర్థితో పార్టీకి కలిసి వచ్చే అదనపు అంశాలపై కాంగ్రెస్ సర్వే చేయనుంది.అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఏఐసీసీలు కార్యదర్శులు, సీనియర్ నాయకులు పోటీ చేయనున్న వివాదరహిత నియోజకవర్గాల్లో సింగిల్ నేమ్‌తో ఉండే 40కి పైగా నియోజక వర్గాల అభ్యర్థులను ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ స్థాయిలోనే ఎంపిక అవుతారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మిగిలిన నియోజకవర్గాల దరఖాస్తులను మరింత లోతైన అధ్యయనం చేసి ఎంపిక చేస్తారని పేర్కొంటున్నాయి. సర్వేలతోపాటు సామాజిక, రాజకీయ పరిస్థితులు స్థానిక సమీకరణాలు ఇలా అన్ని కోణాల్లో పరిశీలన చేసి లాబీయింగ్‌కు తావు లేకుండా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని నేతలు చెబుతున్నారు.

# ఖమ్మంలో హీటెక్కుతున్న పాలిటిక్స్

**ఖమ్మం, సెప్టెంబర్ 4:**

ఖమ్మం జిల్లా రాజకీయాలు రోజురోజుకింత ఆసక్తికరంగా మారుతున్నాయి. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీఆర్ఎస్ పార్టీని వీడటం దాదాపు ఖరారైనట్టుగానే కనిపిస్తోంది. ఇక హస్తం పార్టీలో చేరేందుకు ముహూర్తం నిర్ణయించుకోవడమే తరువాయి అన్నట్టుగా పరిస్థితి కనిపిస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి తాజాగా తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఖమ్మంలోనికి తుమ్మల నివాసానికి వచ్చిన పొంగులేటి ? కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆయనను ఆహ్వానించారు. ఆయన రాక కోసం తాము ఎదురుచూస్తున్నామని తెలిపారు. రెండు రోజుల క్రితం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా హైదరాబాద్‌లో తుమ్మలతో భేటీ అయ్యారు. పార్టీలోకి రావాలని తుమ్మలను రేవంత్ ఆహ్వానించారు.బీఆర్ఎస్ పార్టీ తనను అవమానించిన రీతిలోనే మాజీ మంత్రి తుమ్మలను ఇప్పుడు అవమానిస్తోందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. పార్టీ నుంచి మిమ్మల్ని మేము తొలగించాం, కాని మీరే వెళ్లేలా చేస్తామనే పరిస్థితిని ఃఖీూ నాయకత్వం చేస్తోందని అన్నారు. అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదని, ఈ విషయాలు చెప్పుకుంటే పరువు పోతుందని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరాలని తుమ్మలను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నానని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తుమ్మలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తుమ్మల రాక కోసం కాంగ్రెస్ శ్రేణులు ఎదురుచూస్తున్నాయని అన్నారు. అయితే పార్టీలో చేరడమన్నది తుమ్మల ఒంటరిగా తీసుకునే నిర్ణయం కాదని, ప్రజల కోరిక మేరకు ఆయన నిర్ణయం తీసుకోవాల్సిన ఉంటుందని పొంగులేటని అన్నారు.కాంగ్రెస్‌లో చేరాలని తనను ఆహ్వానించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మాజీ మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. తన స్వార్థం, తన కుటుంబం కోసం తాను ఏనాడు పనిచేయలేదని స్పష్టం చేశారు. మంత్రిగా తాను ఖమ్మం జిల్లాను మిగిలిన అన్ని జిల్లాల కంటే మిన్నగా అభివృద్ధి చేశానని అన్నారు. కాంగ్రెస్‌లో చేరిక గురించి ఆయన ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

# ఇల్లెందు బరిలో మహిళా ప్రొఫెసర్

**ఖమ్మం, సెప్టెంబర్ 4:**

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైన ఇల్లందు రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈ సీటు నుంచి పోటీ చేయాలని చాలా మంది భావిస్తున్నారు. ఇదిలా ఉంటే? ఓ మహిళా ప్రొఫెసర్ కూడా ఈ జాబితాలో చేరిపోయింది .రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థుల జాబితాపై ప్రధాన పార్టీలు దృష్టిపెట్టాయి. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను(115) ప్రకటించగా.. త్వరలోనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల జాబితాలు రానున్నాయి. ఇదిలా ఉంటే... ఇతర పార్టీల నుంచి పోటీ చేయడమే కాకుండా, ఇండిపెండెంట్ గా కూడా బరిలో నిలిచే వాళ్లు ఏర్పాట్లు చేసుకునే పనిలో పడ్డారు. మరికొద్దిరోజుల్లోనే ఎన్నికల నగారా మోగబోతున్న నేపథ్యంలో.... పోటీ చేసే స్థానాలపై గురిపెట్టారు. అయితే రిజర్వుడు నియోజకవర్గాల నుంచి ఎక్కువ మంది బరిలో ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ దరఖాస్తుల స్వీకరించగా... ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఇల్లందు సీటు కోసం ఏకంగా 36 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక ఇతర ప్రాంతీయ పార్టీల్లో కూడా డిమాండ్ ఎక్కువగానే ఉంది. ఇదిలా ఉంటే... ఇదే ఇల్లందు సీటు నుంచి బరిలో ఉండేందుకు ఓయూకు చెందిన ఓ మహిళా ప్రొఫెసర్ రంగం సిద్ధం చేసుకున్నారు. ఆమె ఎంట్రీ ఖరారు కావటంతో... ఇల్లందు రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని లా డిపార్ట్ మెంట్ ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ ప్రకటించారు. ఈమె మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కుమార్తె. ఇటీవలే ఇల్లెందులో మీడియాతో మాట్లాడిన ఆమె.... పోటీ విషయంపై ఓ ప్రధాన పార్టీకి చెందిన నేతలు కలిశారని, పోటీ చేయాలని కోరారని తెలిపారు. అయితే తాను మాత్రం రాజకీయ పార్టీలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాని స్వతంత్రంగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని కుట్రలు, కబ్జా రాజకీయాల బారినుంచి కాపాడేందుకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగుతానని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను కూడా ప్రస్తావించారు అనురాధ. ఇక ప్రస్తుతం గుమ్మడి అనురాధ ఉస్మానియా పీజీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ గా పని చేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్గా ఉద్యోగం సాధించిన తొలి ఆదివాసీ మహిళగా కూడా అనురాధకు గుర్తింపు దక్కింది.అనురాధ తండ్రి గుమ్మడి నర్సయ్య... ఇయన అంటే తెలియని వారు ఉండరు. సీపీఐ ఎంఎల్ పార్టీ విప్లవ రాజకీయాల్లో రాష్ట్ర నాయకుడిగా, ఇల్లెందు నియోజకవర్గం నుంచి 1983, 1985, 1989, 1999, 2004లో 5 పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎలాంటి ఆర్భాటాలకు తావులేకుండా తన పదవీ కాలమంతా ప్రజల మధ్యనే గడిపారు నర్సయ్య. ఇప్పటికీ ఒక సామాన్య జీవితం గడుపుతున్నారు. ఇప్పటికీ ఆయన వ్యవసాయం మీదే ఆధాపడుతూ జీవనం గడుపుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో రెండుసార్లు ఓడిపోయారు. అయినా పార్టీని అంటిపెట్టుకుని, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేస్తూ ప్రజలతోనే జీవిస్తున్నారు. 25 ఏళ్లు ఎమ్మెల్యేగా చేసినప్పటికీ ఏనాడు కూడా అవినీతిని దరిచేరనివ్వని గొప్ప నాయకుడిగా నర్సయ్య పేరు పొందారు. ఈ నేపథ్యంలో నర్సయ్య కుమార్తె కావటమే కాకుండా... ప్రొఫెసర్ గా పని చేస్తున్న అనురాధతో బీఆర్ఎస్ చర్చలు జరిపినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఆమె టికెట్ ఇచ్చి... ఇల్లందు నుంచి బరిలో ఉంచాలని భావించింది. ఈ మేరకు ఆమెతో చర్చలు జరిపినప్పటికీ... అనురాధ స్వతంత్రంగానే పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు.గత ఎన్నికల్లో ఇక్కడ్నుంచి కాంగ్రెస్ తరపున బానోతు హరి ప్రియా నాయక్ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఆమె బీఆర్ఎస్ లో చేరారు. ప్రస్తుతం ఆమెకో మరోసారి టికెట్ కూడా ప్రకటించింది గులాబీ అధినాయకత్వం. ఇక కాంగ్రెస్ పార్టీ తరపున ఇంకా ఖరారు కావాల్సి ఉంది. ఇలాంటి నేపథ్యంలో... మాజీ ఎమ్మెల్యే నర్సయ్య కుమార్తె అయిన గుమ్మడి అనురాధ పోటీ ఇల్లందులో ఆసక్తికరంగా మారింది.

# మరో వివాదంలో మైనంపల్లి

**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఇటీవల వార్తల్లో ఎక్కువ నిలుస్తున్న సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితం బీఆర్ఎస్ అగ్రనేతల్లో ఒకరైన మంత్రి హరీశ్ రావుపై వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతల గురించి కూడా మాట్లాడిన ఆడియో రికార్డింగ్ లు బయటికి వచ్చాయి. తాను కేసీఆర్, కేటీఆర్ ఎవరికీ భయపడబోనని తేల్చి చెప్పారు. తాజాగా ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మరో వివాదంలో చిక్కుకున్నారు. మైనంపల్లిపై బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయి ప్రసాద్ రాష్ట్ర ఎన్నికల అధికారి, డీజీపీకి ఫిర్యాదు చేశారు. పోలీసులను ఉపయోగించి మైనంపల్లి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని సాయి ప్రసాద్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, సాయి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని తెలంగాణ డీజీపీ, మేడ్చల్ జిల్లా కలెక్టర్కు రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు.మరోవైపు, ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కొంతకాలంగా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. ఆయన తనతో పాటు తన కుమారుడికి కూడా టికెట్ ఇవ్వాలని కోరిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ పార్టీ అందుకు ఒప్పుకోకపోవడంతో ఎమ్మెల్యే రెబల్ గా వ్యవహరిస్తున్నారు. తన అనుచరులతో మాట్లాడి వారం రోజుల్లో నిర్ణయాన్ని ప్రకటిస్తానని చెప్పారు. తాజాగా ఆయన చెప్పిన డెడ్ లైన్ నిన్నటితో ముగియగా.. ఏ నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.అయితే, మైనంపల్లి హనుమంతరావు పార్టీకి వ్యతిరేక వ్యాఖ్యలు చేసినప్పటికీ ఆ తర్వాత కూడా మైనంపల్లికి టిక్కెట్ ప్రకటించారు. ఇప్పటికీ ఆయనపై చర్యలు తీసుకోలేదు. ఏ క్షణమైనా సస్పెండ్ అనే లీకులు వస్తున్నాయి. ప్రత్యామ్నాయ అభ్యర్థిపై కసరత్తు చేస్తున్నారని చెబుతున్నారు. కానీ ఆయన సైలెంట్ గా ఉంటే అంతా సర్దుకుపోతుందని బీఆర్ఎస్లోని ఓ వర్గం గట్టి నమ్మకంతో ఉంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా టీం కూడా మైనంపల్లికి వ్యతిరేకంగా పోస్టులు ఆపేసింది. గత ఏడాది డిసెంబర్లో మైనంపల్లి హన్మంతరావు మల్కాజిగిరి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలందర్నీ తన నివాసానికి పిలిచారు. మల్లారెడ్డి కారణంగా పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని ఆరోపణలు చేశారు. ఈ అంశం బీఆర్ఎస్ లో హాట్ టాపిక్ అయింది. కానీ తర్వాత చల్లారిపోయింది. అప్పట్లో మల్లారెడ్డిని టార్గెట్ చేసిన మైనంపల్లి హన్మంతరావు ఇప్పుడు పార్టీలో మరో కీలక అయిన హరీష్ రావును లక్ష్యంగా ఎంచుకున్నారు. హరీష్ రావుపై చాలా తీవ్రమైన ఆరోపణలు చేశారు. సిద్దిపేటలోనే ఓడిస్తానని సవాల్ చేశారు. మైనంపల్లి సవాళ్లను చూస్తే... హరీష్ రావును పూర్తి స్థాయిలో టార్గెట్ చేశారని అర్థం చేసుకోవచ్చు. మైనంపల్లికి, హరీష్ రావుకు పాత గొడవలు ఉన్నాయా అంటే.. లేవనే సమాదానం వస్తుంది. అయినా హరీశ్ రావును మైనంపల్లి టార్గెట్ చేశారు.బీఆర్ఎస్ వర్గాల నుంచి వస్తున్న సమాచారం మేరకు మైనంపల్లి తన కుమారుడికి టిక్కెట్ విషయంలో తగ్గే అవకాశం లేదని.. ఆయన పార్టీ మారిపోవడం ఖాయమని కూడా ప్రచారంలో ఉన్నారు. కానీ, ఆయన లాంటి నేతలు వదులుకోవడం ఇష్టం లేని కేసీఆర్.. దారికి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అంటున్నారు.

# పుంగనూరు కేసులో చల్లా బాబు అరెస్ట్

**తిరుపతి, సెప్టెంబర్ 4**

టిడిపి అధినేత నారా చంద్రబాబు పుంగనూరు పర్యటనలో అల్లర్లు చోటు చేసుకున్నాయ్. ఈ కేసులో పుంగనూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్ చార్జ్ చల్లా బాబు అలియాస్ రామచంద్రారెడ్డిపై పోలీసులు ఏడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ౦1 ముద్దాయిగా చల్లా బాబును చేర్చారు. ఆయనపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇన్నాళ్ళు చల్లా బాబు అజ్ఞాతంలో ఉంటూనే...హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు 7 కేసుల్లో 4 కేసులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. మిగిలిన 3 కేసుల్లో బెయిల్ మంజూరు చేయలేదు. దీంతో చల్లా బాబు... పుంగనూరు పోలీసు స్టేషన్ లో లొంగిపోయారు. స్టేషన్ వద్ద ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. డిఎస్పి సుధాకర్ రెడ్డి సమక్షంలో చల్లా బాబు లొంగి పోయారు. చల్లా బాబును పోలీసులు రిమాండ్ కు తరలించనున్నారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి పేరుతో తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు చేపట్టిన యాత్ర... యుద్ధాన్ని తలపించింది. వైసీపీ నేతలు, కార్యకర్తల దాడులు, కవ్వింపు చర్యలతో టీడీపీ కార్యకర్తలు ప్రతిదాడులకు దిగారు. దీంతో అటు అన్నమయ్య జిల్లా అంగళ్లు, ఇటు చిత్తూరు జిల్లా పుంగనూరు శివారులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయ్. ఆగస్టు 4న చంద్రబాబు చేపట్టిన యాత్ర ములకలచెరువు, బి.కొత్తకోట మండలాల్లో పూర్తి చేసుకుని... కురబలకోట మండలం అంగళ్లు మీదుగా చిత్తూరు జిల్లాలో ప్రవేశించాల్సి ఉంది. అంగళ్లులో ఉదయం నుంచే వైసీపీ కార్యకర్తలు చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు యత్నించాయి. వైసీపీ కార్యకర్తలను టీడీపీ శ్రేణులు తరమేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు సర్దిచెప్పినా రెండు వర్గాలు వినకపోవడంతో ప్రస్తుతం అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాళ్లదాడి తర్వాత వాహనాలను ధ్వంసం చేశారు. రెండు పోలీస్ వాహనాలకు నిప్పు పెట్టారు. ఘర్షణను నివారించేందుకు ముందుగా లాఠీ చార్జ్ చేశారు.. అదుపులోకి రాకపోవడంతో భాష్ప వాయువుని ప్రయోగించారు.. అయినప్పటికీ ఇరు వర్గాలు రెచ్చిపోయి దాడులు చేసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంట్రీ మొదలు చంద్రబాబు పర్యటనలో ఉద్రిక్తత ఏర్పడింది.మొదట పుంగనూరు మీదుగా చంద్రబాబు సోంపల్లి ప్రాజెక్టు సందర్శనకు వెళ్లాల్సి ఉంది. అయితే గో బ్యాక్ చంద్రబాబు నినాదాలతో వైసీపీ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చారు. మొదట మొలకల చెరువు వద్ద భారీగా చేరుకున్న టీడీపీ కార్యకర్తలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అంగళ్లులో మంత్రి పెద్దిరెడ్డికి చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. దాక్కోవడం కాదు, దమ్ముంటే రమ్మని పిలిస్తున్నానంటూ సవాల్ విసిరారు. కేవలం గొడవ చేయడానికే చంద్రబాబు పుంగనూరులోకి వచ్చారని రిషాంత్ రెడ్డి వివరించారు. పుంగనూరు బైపాస్ రోడ్డు మీదుగా చంద్రబాబు పర్యటన సాగాల్సి ఉందన్నారు. కానీ, గొడవ చేయడానికే పుంగనూరులోకి ప్రవేశించారని చెప్పారు. పోలీసులపై పక్కా ప్లాన్ ప్రకారమే దాడి చేశారని ఆరోపించారు.

# అనుమానంతో భర్తను గొడ్డలితో కొట్టి చంపిన భార్య

**అల్లూరి**

అల్లూరి జిల్లా జీకే వీధి మండలం సప్పర్ల గ్రామంలో దారుణం జరిగింది. భర్త కొర్ర కృష్ణారావుని భార్య గేమ్మెలి ఈశ్వరమ్మ అలియాస్ ఈరమ్మ గొడ్డలితో తలపై కొట్టి చంపింది. మృతుడు కొర్ర కృష్ణారావు తల్లి కొర్ర లక్ష్మి సీలేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అల్లూరి జిల్లా జీకి వీధి మండలం సప్పర్ల గ్రామంలో భార్యాభర్త లయిన కొర్ర కృష్ణారావు గమ్మిలి ఈశ్వరమ్మ అలియాస్ వీరమ్మ నివాసముం టున్నారు. ఆగస్టు 30 న రాత్రి 9 గంటల సమయంలో ఇంటిదగ్గర భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. గమ్మిల ఈశ్వరమ్మ అనుమానంతో భర్తను గొడ్డలితో తలపై గట్టిగా కొట్టింది. తీవ్ర రక్తస్రావంతో మరుసటి రోజు నర్సీపట్నం ఏరియా హాస్పిటల్ లో భర్త కృష్ణారావు మరణించాడు దీనిపై మృతుని తల్లి కొర్ర లక్ష్మి సీలేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసును ఛాలెంజ్ గా తీసుకొని జీకే విధి సీఐ అశోక్ కుమార్, సీలేరు ఎస్ఐ రామకృష్ణ దర్యాప్తు ప్రారంభించి తమ సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి సాంకేతాలు ఆధారాలు ఆధారంగా రెండు రోజుల్లో చాకచక్యంగా కేసును ఛేదించారు. భార్యే నిందితురాలని నిర్ధారించారు. కుర్ర కృష్ణారావుకు 20 సంవత్సరాల క్రితం నాగమణి అనే ఆమెతో వివాహం జరిగిందని వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి మొదటి భార్య అనారోగ్యంతో మరణించింది. అయితే అదే గ్రామంలో భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న గేమిలి ఈశ్వరమ్మ పెద్దల సమక్షంలో రెండవ వివాహం చేసుకుని సప్పర్ల గ్రామంలో నివాసం ఉంటున్నారు అయితే మొదట భార్య బిడ్డలను రెండవ భార్య సరిగ్గా చూడటం లేదని మృతుడి తల్లి ముగ్గురు బిడ్డలను హాస్టల్లో జాయిన్ చేసింది.మృతుడు కృష్ణారావు భార్య ఈశ్వరమ్మ ప్రతిరోజు ఒకరినొకరు అనుమానంతో గొడవలు పడుతూ తిట్టుకుంటూ కొట్టుకుంటూ ఉండేవారని స్థానికుల సమాచారం. విసుగు చెందిన భార్య కృష్ణారావుని అడ్డు తొలగించుకోవాలని ఇంట్లో ఉన్న గొడ్డలి తో తలపై మూడుసార్లు గట్టిగా కొట్టగా తీవ్ర రక్తస్రావ ంతో నర్సీపట్నం ఏరియా హాస్పిటల్ లో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

# రాష్ట్రంలో జగనన్న విద్యుత్ కోతల పథకం అమలువుతోంది

**మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు**

**విశాఖపట్నం సెప్టెంబర్ 4**

రాష్ట్రంలో విద్యుత్ కోతలపై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో జగనన్న విద్యుత్ కోతల పథకం అమలువుతోందని, ఇక పరిశ్రమలకు కూడా కష్టకాలం వచ్చేసిందంటూ వ్యాఖ్యలు చేశారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ... "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగనన్న విద్యుత్ కోతల పథకం అమలు... ఇక పరిశ్రమలకు కూడా కష్టకాలం వచ్చేసింది... ద్యుత్ సరఫరాలో బారి కోతలు విధిస్తూ పరిశ్రమలకు వినియోగ గడువు నిర్ణయించడంతో పాటు వారానికో రోజు పవర్ హాలిడే ప్రకటించి పరిశ్రమల నడ్డి విరుస్తున్నారు. ఏపీలో పరిశ్రమలపై నాలుగున్నారేళ్లగా పిడుగులు పడుతూనే ఉన్నాయి. పరిశ్రమలు అంటే వైసీపీ ప్రభుత్వానికి డబ్బులు కట్టే సంస్థలుగానే చూస్తున్నారు కానీ? అవి కొన్ని లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయని? వాటిని కాపాడుకుందామనే ఆలోచన ఎప్పుడూ చేయలేదు.... కరెంట్ చార్జీలను ఇష్టం వచ్చినట్లుగా పెంచడంతో ఫెర్రో అల్లాయిన్ పరిశ్రమలు దాదాపుగా మూతబడ్డాయి. ఇప్పుడు ఇతర పరిశ్రమలకూ కరెంట్ కోతలతో అదే పరిస్థితిని తీసుకొస్తున్నారు. కష్టకాలంలో సహజంగా పరిశ్రమలకు ఏప్రిల్, మే నెలల్లో పవర్ హాలిడే ప్రకటిస్తారు. కానీ సెప్టెంబరు తొలివారంలోనే ఈ విధానాన్ని అమలు చేయడం వైసీపీ ప్రభుత్వ చేతకాని అసమర్థ పాలనకు ఇది ఒక మచ్చుతునక... ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే భవిష్యత్తులో ఇంకా ఎలాంటి దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తోంది జగన్మోహన్ రెడ్డి గారు. మీరు అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై వేల కోట్ల భారం వేశారు... రైతులకు పంట చేతికి వచ్చే సమయానికి విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు... రైతులకు కనీసం ఇస్తానన్న 9 గంటల కరెంటు కూడా సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు" అంటూ మండిపడ్డారు.

"రాష్ట్ర విభజన తరువాత 22 మిలియన్ యూనిట్లు లోటు ఉన్న రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు తన అనుభవంతో సర్ప్లస్ చేసి ప్రతి ఇంటికి 24 గంటలు, పరిశ్రమలకు 24/7 కరెంటు అందించిన ఘనత చంద్రబాబు నాయుడుది. రాష్ట్ర విభజన తరువాత 9529 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం నుంచి 19,080 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది. మీరు అధికారంలోకి రాకముందు సర్ప్లస్లో ఉన్న రాష్ట్ర విద్యుత్ ఇప్పుడు ఎందుకు అస్తవ్యస్తంగా మారిందో.. 2019 నుంచి విద్యుత్తు రంగంలో చోటు చేసుకున్న పరిణామాలపై ఆర్థిక సంస్థల నుంచి రాష్ట్ర ఇంధన సంస్థలు తీసుకున్న రుణాలు, ట్రాన్స్ఫార్మర్లు, స్మార్ట్ మీటర్ల కోసం చేసిన అప్పుల వివరాలను శ్వేతపత్రాన్ని విడుదల చేసి ప్రజలకు వివరించే ధైర్యం మీకు ఉందా జగన్మోహన్ రెడ్డి గారు..?. మీ అసమర్థ పాలన వలన ఒక్క విద్యుత్ వ్యవస్థనే కాకుండా రాష్ట్రాన్ని అన్ని విభాగాల్లో భ్రష్టు పట్టించారు, మీరు తగిన మూల్యం చెల్లించుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయి జగన్మోహన్ రెడ్డి. బై జగన్... బై బై జగన్" అంటూ గంటా శ్రీనివాసరావు ట్వీట్ చేశారు.

# తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చుదిద్దుతా

**తిరుమల, సెప్టెంబర్ 4:**

విమర్శలకు తలొగ్గి అభివృద్ధిని ఆపే వాడిని కాదని, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చుదిద్దుతామని తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి తుడా కార్యాలయం వెనుక తిరుపతి స్మార్ట్ సిటీ నిధులతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన కచ్ఛపి ఆడిటోరియంను, సుకృతి కళానిలయంను ఆదివారం ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, స్మార్ట్ సిటీ ఎండి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. తిరుపతిని ఎన్ని రకాలుగా అభివృద్ధి చేయొచ్చని గడిచిన నాలుగేళ్ళలో చేసి చూపించాం అన్నారు. రాష్ట్రంలో తిరుపతి నగరంలో జరిగినట్లు అభివృద్ధి మరెక్కడా జరగలేదన్నారు. విమర్శలకు తలొగ్గి అభివృద్ధిని ఆపేవాడికి కాదని, ఎన్నడూ లేని విధంగా 18 మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసి తిరుపతి నలుదిక్కులను అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ఈ యజ్ఞం ఇంతటితో ఆగదని, తిరుపతిని ఆధ్యాత్మిక, సాహిత్య, కళలు, మానవీయ విలువలు పెంపొందించేలా అభివృద్ధి చేస్తామన్నారు. సరస్వతీ దేవి చేతిలోని వీణ అయిన కచ్ఛపి పేరుతో ప్రారంభించిన ఈ ఆడిటోరియం అందుబాటులోకి రావడం సంతోషకరమని టీటీడీ ఛైర్మెన్ భూమన కరుణాకర రెడ్డి అన్నారు. అనంతరం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ.. తిరుపతిలో అభివృద్ధితో బాటు కళలకు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ముందుంటున్న భూమన కరుణాకర్ రెడ్డి బాటలోనే మనమంతా పయనిద్దామన్నారు. తిరుపతి నగరం సుందరీకరణతో బాటు రహదారులు విస్తరించడంతో ఒక మంచి రూపు సంతరించుకున్నదన్నారు. మరో 30 ఏళ్లు ముందు అవసరాలకు సరిపడా రహదారులు నిర్మాణం చేస్తున్నారని, రహదారులు సౌకర్యవంతంగా ఉంటుందో అక్కడ అభివృద్ధి ఉంటుందన్నారు.. తిరుపతి నగరంలో రహదారులు సౌకర్యవంతంగా భూమన కరుణాకర్ రెడ్డి అభివృద్ధి చేశారన్నారు.. ఆరు కోట్ల మంది తిరుపతి - తిరుమలను సందర్శిస్తున్నారని, ఈ రోజు వచ్చే యాత్రికులకు, నగర ప్రజలకు సరిపడా రహదారులు నిర్మాణం జరిగిందని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలియజేశారు.సామాన్య భక్తుడి తరహాలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లోకి ప్రవేశించి సర్వదర్శనం భక్తుల కోసం టీటీడీ కల్పించిన వసతులను శనివారం పరిశీలించారు. సామాన్య భక్తులకు అన్నప్రసాదం, తాగునీరు, కాఫీ, టీ వంటివి సకాలంలో అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకుని అన్నప్రసాదం భక్తులకు సరిపోయేంతగా పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఉదయం నుండి ఇప్పటివరకు 47 కంపార్ట్మెంట్ల నుంచి టోకెన్ లేని భక్తులను దర్శనానికి పంపామని, దర్శనానికి 14 గంటల సమయం పడుతుందని విజిలెన్స్ అధికారులు వివరించారు

# ఎన్నికలలో డబ్బులు పంచడం నేర్పిన వ్యక్తి చంద్రబాబు

**కృష్ణా సెప్టెంబర్ 4**

మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నానిమరోసారి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిపై నోరుపారేసుకున్నారు. ఎన్నికలలో డబ్బులు పంచడం నేర్పిన వ్యక్తి చంద్రబాబు అంటూ వ్యాఖ్యలు చేశారు. 1999 లోనే ఒక్కో అభ్యర్థికి కోటి చొప్పున ఇచ్చారని ఆరోపించారు. ఆ తర్వాత ఎన్నికలలో వరసగా 5, 10, 20, 30 కోట్ల రూపాయలు చొప్పున అభ్యర్థులకు ఇచ్చారన్నారు. పదివేల కోట్ల రూపాయలు తన పార్టీ అభ్యర్థులకు చంద్రబాబు ఇచ్చాడనేది వాస్తవమన్నారు. ఈ డబ్బు అంతా చంద్రబాబుకు ఎలా వచ్చిందంటే కమిషన్లు తీసుకోబట్టే కదా అని అన్నారు.



ఇప్పుడు ఐటీ నోటీసులు ఇచ్చిన 118 కోట్లు అనేది చాలా తక్కువ మొత్తమన్నారు. ఇది రికార్డుగా దొరికిన డబ్బు మాత్రమే అని.. లక్ష కోట్లు వరకు దోచుకున్నారని ఆరోపించారు. హెరిటేజ్ ద్వారా ఇన్ని వేల కోట్లు ఎలా వచ్చాయో చంద్రబాబు చెప్పగలరా అని ఆయన ప్రశ్నించారు.

# బీసీ సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ....

**కమాన్ పూర్**



కమాన్ పూర్ మండల కేంద్రంలో బీసీ సింహ గర్జన గోడ పోస్టర్ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పొన్నం నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 10న హైదరాబాద్ లోని సరూర్ నగర్ లో జరిగే ఈ కార్యక్రమానికి బీసీ నేతలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా నుండి అధిక సంఖ్యలో హాజరుకావాలని నల్లవెల్లి శంకర్ కోరారు. ఈ కార్యక్రమానికి కార్యక్రమానికి ఈ బీసీ సంక్షేమ సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి శంకర్ మాజీ ఎంపీపీ మల్యాల రామచంద్రన్ గౌడ్ రైతు సమన్వయ సమితి కన్వీనర్ గడప కృష్ణమూర్తి స్థానిక సర్పంచి నీలం శ్రీనివాస్ సరిత కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు సత్యనారాయణ గౌడ్ బిజెపి సీనియర్ నాయకులు మచ్చగిరి రాము లు మాట్లాడుతూ మేం ఎంతో మాకు అంత వాటా దక్కాలని చట్టసభల్లో మన మాట మనకు దక్కాలని చట్టసభల్లో ప్రాతినిథ్యం వహిస్తే బీసీలకు న్యాయం జరుగుద్ది అని అన్నారు ఈ కార్యక్రమంలో తోట రాజ్ కుమార్ విజయ్ కుమార్ గౌడ్ నగునూ నరసయ్య గౌడ్ వెంకన్న బాద్రపు శంకర్ బోనాల సత్యనారాయణ పటేల్ వెంగలి రాజయ్య గౌడ్ కమ్మవారి అనిల్ గౌడ్ లక్ష్మీరాజ్యం గర్రెపల్లి సత్యం మిట్ట సందీప్ నారగోని సతీష్ కుమార్ సుంచు శ్రీనివాస్ జంగా పెల్లి తిరుపతి మెతుకు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు

# విత్తన గణపతి ప్రతిమల అందజేత

**హైదరాబాద్**



సంకల్పం ఎంత గొప్పదైతే ప్రజల నుంచి అంత మంచి స్పందన లభిస్తుందన్నారని రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం నాడు కూకట్ పల్లి.. కే.పీ.హెచ్.బీ ఫేజ్ ? 6 లోని నెక్సెస్ హైదారాబాద్ మాల్ లో "గ్రీన్ ఇండియా ఛాలెంజ్" ఆధ్వర్యంలో చిన్నారులకు అయన సీడ్ గణేష్ ప్రతిమలను అందిచారు. సంతోష్ మాట్లాడుతూ గణేష్ పండగ అంటే చిన్నరులకు అమితమైన ఇష్టమని.. అలాంటి పండుగలో ఒక మంచి ఆశయాన్ని జతచేయాలనే ఆలోచనతో నాలుగు సంవత్సరాల క్రితం విత్తనాలను మిళితం చేసి గణేష్ ప్రతిమలను తయారు చేయించి భక్తులకు అందించాం. దానికి మంచి స్పందన రావడం.. చిన్నారులు, వారి తల్లిదండ్రులు సీడ్ గణేషుడి ప్రతిమలు కావాలని అడగడంతో ప్రతీసారి ప్రతిమలను పంపిణీ చేస్తూ వస్తున్నాం. ఇవ్వాల ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ చిన్నారి ఎంతో సంతోషంతో గణేష్ ప్రతిమలను తీసుకోని మురిసిపోవడం చూస్తుంటే చాలా సంతోషం కలుగుతుంది. కల్మషం లేని వారి మనసులో "గ్రీన్ ఇండియా ఛాలెంజ్" ద్వారా ఒక సామాజిక బాధ్యతను నేర్పుతున్నందుకు చాలా గర్వంగా ఉందన్నారు జోగినిపల్లి సంతోష్ కుమార్.

# ట్రాఫిక్‌ను తప్పించుకునేందుకు ఏకంగా ఆటో ను ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కించేశాడు

**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 4**



;
ప్రముఖ నగరాల్లో ట్రాఫిక్ సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సినపనిలేదు. ఒక్కసారి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయామంటే అంతే సంగతులు. గంటల తరబడి అక్కడే చిక్కుకు పోవాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనదారులైతే వాహనాల మధ్యలో దూరి ఈజీగా వెళ్లిపోతుంటారు. అయితే, ఆటో, కారు, బస్సులు మాత్రం ముందు వాహనాలు కదిలే వరకూ వేచి ఉండాల్సిందే. అయితే, దేశ రాజధాని ఢిల్లీ లో ఓ ఆటో డ్రైవర్) మాత్రం ట్రాఫిక్‌ను తప్పించుకునేందుకు తన మూడు చక్రాల వాహనాన్ని ఏకంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కించేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఈ ఘటనపై స్పందించిన పోలీసులు ఆటో డ్రైవర్‌ను 25 ఏళ్ల మున్నాగా గుర్తించారు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి ఆటోన సీజ్ చేశారు.

# నీటికోసం తండ్లాడిన నేలల్లో సుజల దృశ్యం సాక్షాత్కారం : మంత్రి కేటీఆర్

**హైదరాబాద్ సెప్టెంబర్ 4**



నీటికోసం తండ్లాడిన నేలల్లో సుజల దృశ్యం సాక్షాత్కారమవుతున్నదని మంత్రి కేటీఆర్ అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఆవిష్కృతమవుతున్నదని, తెలంగాణ జలవిజయ పతాకం సగర్వంగా ఎగురుతున్నదని చెప్పారు. తెలంగాణ సాగునీటిరంగంలో పీఆర్ఎల్ఐ మరో కాళేశ్వరమని సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. అవాంతరాలను, అడ్డంకులను అధిగమిస్తూ.. కుట్రలను, కేసులను గెలుస్తూ జలసంకల్పంతో అనుమతులు సాధించామన్నారు. దశాబ్దాల కలను సాకారం చేస్తూ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తవుతున్నదని తెలిపారు. బిరబిరా కృష్ణమ్మ బీళ్లకు నీళ్లందించనున్నదని చెప్పారు.

# ఉదయనిధి వ్యాఖ్యాలను ఖండించిన బజరంగ్ దళ్

**హైదరాబాద్**

హిందూ ధర్మాన్ని సమూలంగా తుడిచివేయాలని తమిళనాడు మంత్రి ఉదయనిది స్టాలిన్ విషపూరిత మాటలను బజరంగ్ దళ్ తీవ్రంగా ఖండిస్తోందని బజరంగ్ దళ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శివరాములు అన్నారు. సమాజంలో చిచ్చుపెట్టి అధికారం అనుభవించాలనే కుట్రలను తప్పుపడుతోంది. హిందూ వ్యతిరేక రచయితల సంఘం పేరుతో సదస్సులు.. సమావేశాలు నిర్వహించి హిందుత్వం పై బురద జల్లితే హైందవ సమాజం తగిన రీతిలో బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. తమిళనాడులో అమలవుతున్న హిందూ వ్యతిరేక రాజ్యాంగాన్ని కాలరాసి, అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం అమలు చేయాలని తెలంగాణ బజరంగ్ దళ్ డిమాండ్ చేస్తుంది. రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఎన్నికైన ఉదయనిది స్టాలిన్ కులమతాలకు అతీతంగా... సర్వ మానవ శ్రేయస్సు కోసం పని చేస్తానని ప్రమాణం చేసిన వ్యక్తి ... ఈరోజు హిందూ సమాజాన్ని సమూలంగా నాశనం చేస్తామనడం ఘోరం.. నేరం.! వెంబడే పోలీసులు ఆయనపై కఠిన చర్యలు తీసుకావాలని.. మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసి రాజ్యాంగాన్ని రక్షించాలని బజరంగ్ దళ్ డిమాండ్ చేస్తుందని అయన అన్నారు.

# ఉదయనిధి క్షమాపణ చెప్పాలి-రేవంత్ రెడ్డి స్పందించాలి

**హైదరాబాద్**

మంత్రి హోదా లో ఉదయనిధి సనాతన ధర్మం నిర్మూలించాలని వ్యాధుల తో పోల్చి హిందువులను అవమాన పర్చారని బీజేపీ నేత డాక్టర్ లక్ష్మణ్ ఆరోపించారు. సోమ వారం అయన మీడియాతో మాట్లాడారు. వారిని సమర్థించింది కొన్ని పార్టీలు, నేతలు 100 కోట్ల హిందువులను అవమానించారు. రేవంత్ స్టాలిన్ వ్యాఖ్య లను తప్పు కూడా పట్టలేదు. ఇదేనా కాంగ్రెస్ పార్టీ వైఖరి. కాంగ్రెస్ వైఖరి పై ప్రజలు ఆలోచన చెయ్యాలి. గజినీ నుంచి ఔరంగ జేబు లు, షాజహాన్ , నిజాం , రజాకార్లు, మజ్లీస్ లు ఎవరు దాడి చేసినా, గుడులు, గోపురాలు, హత్య లు చేసినా ధర్మం పెరుగుతూనే ఉన్నది. తమిళనాడు , భారత చరిత్ర వేర్వేరు కాదు. తమిళనాడు నుంచి తూర్పు దేశాల వరకు వేలాది సంవత్సరాలు సనాతనం కొనసాగుతున్నది.
మూర్ఖంగా మాట్లాడే యువ మంత్రి నీ ప్రభుత్వ చిహ్నాన్ని తొలగించి చూడు. యీ ధర్మం పట్ల ఈర్ష్య ,ద్వేషం ఉంటే ఆలయాలు మఠాల కు అప్పగిస్తవా అని అన్నారు. దేవాలయాల అదాయల తో ఖజానా నింపుకుంటున్నవ్. సనాతన ధర్మం పాటించే వారి ఓట్ల అక్కరలేదు అని చెప్పే దమ్ముందా. మీ తల్లి, నానమ్మ పాటించారు కదా.. వాళ్ళను కూడా నాశనం చేస్తావా దమ్ముందా? రేవంత్ ఎందుకు స్పందించలేదు.. ఇండియా జీ కూటమి లో ఉన్నారు కదా. తెలంగాణ లో హిందువులు, సనాతన ధర్మం ఆచరించే ప్రజలు ఆలోచన చెయ్యాల్సిన సమయం ఇది. సెక్యులర్ ముసుగు లో హిందూ వ్యతిరేక పెంచింది కాంగ్రెస్. 15 నిమిషాల్లో హిందువులను నిరుములిస్త అన్న మజ్లీస్ తో అంట కాగింది కాంగ్రెస్. అయోధ్య రామ మందిరం వ్యతిరేకించింది కాంగ్రెస్. మైనారిటల ఓట్ల కోసం దిగజారే పార్టీ కాంగ్రెస్. కర్ణాటక లో ఓట్ల కోసం బాజరంగ్ దల్ ను నిషేదిస్త అన్నది. కాంగ్రెస్ సాఫ్రాన్ టెర్రరిజం అనే పేరు కాంగ్రెస్ తెచ్చింది. ప్రపంచం ఇస్లామిక్ టెర్రరిజం తో బాధ పడుతుంటే ఓట్ల వేట లో కాంగ్రెస్ ఉంది. బాంబు లు పేల్చే వారి మీద సన్నాయి నొక్కులు నొక్కేది కాంగ్రెస్. మీ ఆటలు సాగవ్.. సర్వేజనా సుఖినోభవంతు అనే ధర్మాన్ని నాశనం చేస్తా అంటారా. ఉదయనిధి క్షమాపణ చెప్పాలి లేదంటే దేశం మొత్తానికి వాళ్ళు మూల్యం చెల్లిస్తారు.. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు అనగానే దడుచుకుంటున్నరు కాంగ్రెస్ నేతలు. అజెండా రాకముందే ఊహాగానాలు తో భయం, అభద్రత, గుబులు.. కుల పార్టీలు, కుటుంబ పార్టీలు, ప్రజల చేత తిరస్కరించి న పార్టీ ల కూటమిలకు మోడీ హటావో తప్ప అజెండా లేదు.. జమిలీ ఎన్నకల్ అంటే గుబులు దేనికీ. మోడీ చరిష్మా, అజెండా, ప్రజల పరిపాలన వల్ల భయం మీకు. కమిటీ నివేదిక కు అరు నెలల సమయం పడుతుంది భయం, అభద్రత దేనికని ప్రశ్నించారు. నెహ్రూ కాలం లో జమిలి జరిగితే లేని భయం ఇప్పుడే దేనికీ. అప్పుడు నెహ్రూ చేసింది తప్పేనా ఒప్పుకుంటారా. ప్రజల కోసం, సమయం, డబ్బులు వృధా కాకుండా ఉండటం కోసం ఆలోచన చేస్తే దేనికీ భయం. వేలాది కోట్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా కర్చు అవసరమా. అధిర్ రంజాన్ కు సభ్యత్వం ఇస్తే దేనికీ భయపడ్డారు. గతం లో జమిలే జరిగితే స్వయం ప్రతిపత్తి దెబ్బతిన్నదా? దక్షిణాది మీద దాడి జరిగిందా? ఏది ఊహాజనితంగా ఉండదు...పార్లమెంట్ లో చర్చ జరుగుతుంది. బీఆర్ఎస్ ఎంపీ గతం లో జమిలే మంచిది అన్నారు ఇప్పుడు మాట ఎందుకు మారుస్తున్నారు.. ఊహకు అందనిది ప్రత్యేక సమావేశాలు, దేశం కోసం చర్చ జరుగుతుందని అన్నారు.

# కళంకారిని రాష్ట్రకళగా ప్రకటించేందుకు కృషి

**- టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి**

**- ఎస్వీ శిల్పకళాశాలలో ప్రారంభమైన మూడు రోజుల వర్క్‌షాప్**

**తిరుపతి, 04**

కళంకారిని రాష్ట్రకళగా ప్రకటించేలా ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ని ఒప్పిస్తానని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు . ఎస్వీ సంప్రదాయ శిల్ప శిక్షణ సంస్థలో సంప్రదాయ ఆలయ శిల్పకళలు – అనుబంధ అంశాలపై మూడు రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఛైర్మన్ మాట్లాడుతూ శిల్పకళాశాలలో కళంకారి రెండేళ్ల సర్టిఫికెట్ కోర్సును నాలుగేళ్ల డిప్లొమా కోర్సుగా మార్చేందుకు బోర్డులో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. 30 వేల సంవత్సరాల క్రితమే శిల్పకళ ప్రారంభమైందని, కళల్లో శిల్పకళకు గొప్ప స్థానం ఉందని చెప్పారు. వేల సంవత్సరాల క్రితమే ఆలయాలు, ప్రార్థనా మందిరాల నుండి ఈ కళ ప్రారంభమైందన్నారు . ప్రపంచంలోని ప్రతి దేశ చరిత్రకు శిల్పకళ ఆధారభూతమైందని వివరించారు. శిల్పకళ విద్యార్థుల నైపుణ్యం గొప్పదన్నారు. 17 సంవత్సరాల క్రితం ఈ కళాశాల పరిస్థితి చూసి సామూహిక మార్పులు చేశానన్నారు. ఈ కళాశాల విద్యార్థులతో అర అడుగు, ఒక అడుగు మేర శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్రతిమలు తయారు చేయించాలని గతంలో భావించానని చెప్పారు. స్వామివారు తనకు మళ్లీ అవకాశం ఇచ్చారని చెప్పారు. ఇలాంటి విగ్రహాలు ప్రతి ఇంట్లో ఉంచుకోవడం ద్వారా స్వామివారు తమతోనే ఉన్నారన్న భావన భక్తులకు కలుగుతుందని తెలిపారు. మూడు రోజుల వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మరింత పెంచుకోవాలని, శిల్పకళాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. జేఈవో సదా భార్గవి మాట్లాడుతూ గతంలో ఛైర్మన్ శ్రీ కరుణాకర్‌రెడ్డి హయాంలోనే కళాశాలకు సొంత భవనం ఏర్పాటైందని చెప్పారు . వర్క్‌షాపులో పనిచేస్తున్న శిల్పులకు ధరలు పెంచారని చెప్పారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని కరుణాకర రెడ్డి ఛైర్మన్ గా ఉన్నప్పుడే ప్రకటించారని తెలియజేశారు. అదేబాటలోనే ప్రస్తుతం పయనిస్తూ కళాశాలను ప్రగతిపథంలో నడిపిస్తున్నామని చెప్పారు. వర్క్‌షాప్‌లు నిర్వహించి విద్యార్థులకు శిల్పకళలోని మెళకువలపై అవగాహన కల్పించామని తెలిపారు. కళాశాల ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 815 మంది విద్యార్థులను శిల్పులుగా తయారు చేసినట్టు తెలియజేశారు. శిల్పకళా ప్రదర్శన ప్రారంభం కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన శిల్పకళాప్రదర్శనను ఛైర్మన్ ప్రారంభించారు. ఇందులో ఆలయ నిర్మాణకళ, శిలా విగ్రహాలు, సుధా(సిమెంటు) విగ్రహాలు, కొయ్య విగ్రహాలు, లోహ విగ్రహాలు, సంప్రదాయ చిత్రకళ, సంప్రదాయ కళంకారి కళ, హస్తకళా ప్రదర్శనలు ఉన్నాయి. కుమారి పి.సాయిదేవిక నిరుపయోగమైన వస్తువులతో తయారుచేసిన వివిధ కళాకృతుల స్టాల్‌ను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. గాజుసీసాలు, మట్టికుండలు, జ్యూట్‌తో తయారుచేసిన గృహాలంకరణకు ఉపయోగపడే అనేక కళాకృతులు ఈ స్టాల్‌లో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్‌రెడ్డి, ప్రముఖ స్థపతి సంతానకృష్ణన్, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మూడో పెళ్లి చేసుకున్న హరీష్ సాల్వే

**లండన్, సెప్టెంబర్ 4:**



దేశంలోని ప్రముఖ న్యాయవాదుల్లో ఒకరైన, భారత మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే మరోసారి పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. సాల్వే 68 ఏళ్ల వయసులో మూడో పెళ్లి చేసుకున్నాడు. సాల్వే ఇటీవల లండన్‌లో అంగరంగ వైభవంగా వివాహ వేడుకలో త్రినాను వివాహం చేసుకున్నాడు. ఈ వివాహానికి నీతా అంబానీ, లలిత్ మోదీ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దేశంలో టాప్ లాయర్ మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే ముచ్చటగా మూడోసారి పెళ్లి కొడుకయ్యారు. 68 ఏళ్ల వయస్సులో ఆయన వివాహం చేసుకున్నారు. లండన్‌లో జరిగిన హరీశ్‌సాల్వేకు అతిరథమహారథులు హాజరయ్యారు. ట్రీనాను పెళ్లి చేసుకున్నారు హరీశ్‌సాల్వే.. జమిలి ఎన్నికల కోసం కేంద్రం నియమించిన కమిటీలో కూడా కీలకసభ్యుడిగా ఉన్నారు హరీశ్‌సాల్వే. దేశంలోని ప్రముఖ్య వ్యాపారవేత్తలంతా హరీశ్‌సాల్వే మ్యారేజ్‌కు హాజరయ్యారు. ముకేశ్ అంబానీ, నీతాఅంబానీ , సునీల్ మిట్టల్ , లక్ష్మి నివాస్ మిట్టల్ గోపి హిందూజా విందుకు హాజరయ్యారు. అంతేకాదు ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ , ఆయన గార్ల్‌ఫ్రెండ్ ఉజ్వల్ రౌత్ కూడా పార్టీలో పాల్గొన్నారు. హరీశ్‌సాల్వే తన మొదటి భార్య మీనాక్షికి 2020లో విడాకులు ఇచ్చారు. తరువాత కరోలిన్ బ్రసార్డ్‌ను పెళ్లి చేసుకున్నారు. హరీశ్ సాల్వే అంతర్జాతీయ న్యాయస్థానంలో భారత్ తరపున పలు కేసులను వాదించారు. కుల్‌భూషణ్ జాదవ్ కేసులో పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారు. టాటాగ్రూప్ , రిలయన్స్ సంస్థలకు కూడా ఆయన లీగల్ అడ్వయిజర్‌గా ఉన్నారు. 1999 నుంచి 2002 వరకు సొలిసిటర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహించారు హరీశ్ సాల్వే. హరీష్ సాల్వే వృత్తిరీత్యా కళాకారిణి అయిన కరోలిన్ బ్రాస్సార్డ్‌ను 2020లో వివాహం చేసుకున్నారు. ఇది మాత్రమే కాదు, సాల్వే క్రైస్తవ మతంలోకి మారారు. ఇక సాల్వే మొదటి భార్య గురించి చెప్పాలంటే ఆమె పేరు మీనాక్షి సాల్వే. హరీష్ సాల్వే 2020 ప్రారంభంలో తన మొదటి భార్య మీనాక్షి సాల్వే నుండి చట్టబద్ధంగా విడిపోయారు. ఇద్దరికీ ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు పేరు సాక్షి కాగా, చిన్న కూతురు పేరు సానియా. ఇప్పుడు మరోసారి లండన్‌లో త్రినా అనే మహిళను సాల్వే మూడో పెళ్లి చేసుకున్నాడుదేశంలోనే అత్యంత ఖరీదైన లాయర్లలో హరీశ్ సాల్వే పేరున్న సంగతి తెలిసిందే. సాల్వే 2003లో అంతర్జాతీయ వ్యవహారాలను సమర్థించడం ప్రారంభించారు. దీని తరువాత అతను లండన్‌లో మాత్రమే నివసించడం ప్రారంభించాడు. అతను 2013లో ఇంగ్లీష్ బార్‌లో నియమితుడయ్యాడు. అదే సంవత్సరంలో క్వీన్స్ కౌన్సెల్‌గా నియమించబడ్డాడు. ఇది మాత్రమే కాదు, సాల్వే వోడాఫోన్, ముఖేష్ అంబానీ, రతన్ టాటా , పెద్ద వ్యక్తుల కేసులపై కూడా పోరాడారు. సాల్వే లండన్‌లో నివసిస్తున్నారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మాత్రమే భారతదేశంలో చట్టాన్ని అభ్యసిస్తున్నారు. దీనితో పాటు, సాల్వే అంతర్జాతీయ న్యాయస్థానంలో భారతదేశం తరపున కులభూషణ్ జాదవ్ తరపున ప్రాతినిధ్యం వహించాడు, దీనికి అతను కేవలం ఒక రూపాయి మాత్రమే తీసుకున్నాడు. ఈ కేసులో సాల్వేపై చాలా ప్రశంసలు వచ్చాయి.

# హీరో విశ్వక్ సేన్ "ఫ్యామిలీ ధమాకా"




డైనమిక్ హీరో విశ్వక్ సేన్ హోస్ట్‌గా రాబోతున్న కొత్త షో "ఫ్యామిలీ ధమాకా" ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన లాంచ్‌ని ప్రకటించినందుకు ఆహా థ్రిల్‌గా ఉంది. ఇది ఓటిటి ప్రపంచంలోకి విశ్వక్ సేన్ యొక్క తొలి షో కావడం, వీక్షకులకు తాజా మరియు ఉత్తేజకరమైన అనుభవాన్ని అందిస్తుంది."ఫ్యామిలీ ధమాకా" సెప్టెంబర్ 8న రాత్రి 8 గంటలకు ప్రీమియర్ ప్రారంభం అవుతుంది. ఇది ప్రేక్షకులకు మరియు కుటుంబ మొత్తానికి వినోదాన్ని అందిస్తుంది. అయితే, ఆహా గోల్డ్ సబ్‌స్క్రైబర్‌లు సెప్టెంబరు 7న మొదటి ఎపిసోడ్‌ని ఆస్వాదించే ప్రత్యేకత ఉంటుంది. ఆహా గోల్డ్, కేవలం రూ. 899కి అందుబాటులో ఉంది, 4ఐ డాల్బీ ఆడియో, యాడ్-ఫ్రీ స్ట్రీమింగ్ మరియు తెలుగు మరియు తమిళ ప్లాట్‌ఫారమ్‌లకు ఒక సంవత్సరం యాక్సెస్ పొందే అవకాషాన్ని అందిస్తుంది ఆహ్లాదకరమైన ప్రీ-లాంచ్ ఈవెంట్‌లో, ఆహా కాకినాడలోని కుటుంబాలతో కలిసి ఫ్యామిలీ ధమాకా యొక్క ఉత్తేజకరమైన గేమ్‌లో పాల్గొన్నారు, ఆ తర్వాత షో యొక్క ఆకట్టుకునే థీమ్ సాంగ్‌తో కూడిన వైబ్రెంట్ వేడుక. ఈవెంట్ అద్భుతమైన విజయాన్ని సాధించింది మరియు రాబోయే వాటికి వేదికగా నిలిచింది అని నిర్వహకులు తెలిపారు.

# 3 రోజుల్లో రూ.70.23 కోట్ల కలెక్షన్స్



టాలీవుడ్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ మూవీ ఖుషి కలెక్షన్స్ జోరు కొనసాగుతోంది. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన ఈ సినిమా లాస్ట్ ఫ్రైడే ప్రేక్షకుల ముందుకొచ్చింది. లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా అందరినీ ఆకట్టుకున్న ఖుషి వసూళ్ల వర్షం కురిపిస్తోంది. మూడు రోజుల్లో ఈ సినిమా 70.23 కోట్ల రూపాయలు రాబట్టింది.

యూఎస్ బాక్సాఫీస్ వద్ద కూడా ఖుషి హల్ చల్ చేస్తోంది. యూఎస్ లో 1.38 మిలియన్ డాలర్స్ కలెక్షన్స్ తో బ్రేక్ ఈవెన్ సాధించింది. 2 మిలియన్ మార్క్ కు ఖుషి పరుగులు పెడుతోంది. థియేటర్స్ డల్ గా ఉండే సోమవారం కూడా ఖుషి నైజాం, ఏపీ లోని అన్ని ఏరియాస్ లో చెప్పుకోదగిన కలెక్షన్స్ రాబట్టింది. దీన్ని బట్టి ఈ వీక్ ఖుషికి బాక్సాఫీస్ వద్ద స్ట్రాంగ్ హోల్డ్ ఉండే అవకాశాలున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మాణంలో దర్శకుడు శివ నిర్వాణ రూపొందించిన ఖుషి మూవీ సూపర్ హిట్ టాక్ తో ప్రదర్శితమవుతోంది. క్లీన్ లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఖుషికి అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి ఆదరణ లభిస్తోంది.

# సెప్టెంబర్ 28న 'రూల్స్ రంజన్' విడుదల



'రాజా వారు రాణి గారు', 'ఎస్ఆర్ కళ్యాణ మండపం', 'వినరో భాగ్యము విష్ణు కథ' చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కిరణ్ అబ్బవరం తాజా చిత్రం 'రూల్స్ రంజన్' కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. 'నీ మనసు నాకు తెలుసు', 'ఆక్సిజన్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న రత్నం కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో 'డీజే టిల్లు' ఫేమ్ నేహా శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. సుప్రసిద్ధ నిర్మాత ఏ.ఎం. రత్నం సమర్పణలో స్టార్ లైట్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై దివ్యాంగ్ లవానియా, మురళి కృష్ణ వేమూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రింకు కుక్రెజ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అమ్రిష్ గణేష్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మూడు పాటలకి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. పాటలకు వస్తున్న అద్భుతమైన స్పందనతో ఎంతో సంతోషంగా ఉన్న నిర్మాతలు తాజాగా చిత్ర విడుదల తేదీని ప్రకటించారు.

'ఇంట్రడక్షన్ ఆఫ్ రూల్స్ రంజాన్' పేరుతో ఈరోజు(సెప్టెంబర్ 4న) మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా కోసం ప్రత్యేకంగా నాలుగో పాటని ప్రదర్శించారు. గత మూడు పాటల్లాగే నాలుగో పాట కూడా కట్టిపడేసింది. అలాగే ఈ సినిమాని సెప్టెంబర్ 28న విడుదల చేస్తున్నట్లు ఏ.ఎం. రత్నం చేతుల మీదుగా విడుదల తేదీని వెల్లడించారు.

సుప్రసిద్ధ నిర్మాత ఏఎం రత్నం మాట్లాడుతూ.. "కిరణ్ ముందుగా నేను నిర్మాతను అని భావించి కథ వినడానికి వచ్చారట. కానీ కథ విని, బాగా నచ్చడంతో వెంటనే ఈ సినిమా చేయడానికి అంగీకరించారట. ఇప్పుడు పాటలు బాలేకపోతే సినిమా మధ్యలో లేచి వెళ్లిపోతున్నారు. అందుకే సంగీతం మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టమని చెప్పాను. నా అనుభవం ప్రకారం ఆడియో హిట్ అయితే సినిమా సగం హిట్ అయినట్లే. 'రంగస్థలం', 'అల వైకుంఠపురములో' వంటి సినిమాలు ఆడియో ఎంత హిట్టో, సినిమాలు అంతకుమించిన హిట్ అయ్యాయి. సినిమా విజయంలో సంగీతం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సినిమాకి అమ్రిష్ అద్భుతమైన సంగీతం అందించారు. ఈ కథని నమ్మి నిర్మించడానికి ముందు వచ్చిన నిర్మాతలు దివ్యాంగ్, మురళి అభినందనలు. ఈ సినిమా క్రెడిట్ వారికే దక్కుతుంది. వినోదాత్మక సినిమాలకి విజయావకాశాలు ఎక్కువ ఉంటాయి. ఇప్పటికే ఈ సినిమా చూశాను. కుటుంబమంతా కలిసి చూడగలిగేలా ఉన్న ఈ చిత్రం ఖచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అన్నారు.

కథానాయకుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. "రూల్స్ రంజన్ ప్రయాణం ఏడాది క్రితం మొదలైంది. ఏ.ఎం. రత్నం గారి ద్వారా కృష్ణ గారిని కలిసి ఈ కథ విన్నాను. ఈ కథ వినేటప్పుడు రెండు గంటల పాటు నవ్వుతూనే ఉన్నాను. థియేటర్లలో చూసేటప్పుడు మీరు కూడా అలాగే నవ్వుకుంటారనే నమ్మకం ఉంది. నేను మనో రంజన్ అనే పాత్ర పోషించాను. మనో రంజన్ మనలో ఒకడిలా ఉంటాడు. అందరూ ఈ పాత్రకి కనెక్ట్ అవుతారు. ఇంత మంచి పాటలు ఇచ్చిన అమ్రిష్ గారికి ధన్యవాదాలు. నేపథ్య సంగీతం కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఏ.ఎం. రత్నం గారి సినిమా చూస్తూ పెరిగాను. ఆయన నిర్మించిన సినిమాల్లో ఖుషి అభిమాన చిత్రం. ఏ.ఎం. రత్నం గారు మా సినిమాని సమర్పించడం గర్వంగా ఉంది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి కారకులైన దర్శకనిర్మాతలకు, నేహా శెట్టి, ఇతర చిత్ర బృందానికి అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు" అన్నారు.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950